రోజా ఉక్కిరిబిక్కిరి

అసంతృప్తులు, ఆరోపణలతో



సరిగ్గా ఎన్నికల వేళ సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకతతో మంత్రి రోజా ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వచ్చే ఎన్నికల్లో టికెట్‌కు ఢోకా లేదని నిశ్చింత ఫీలవుతున్న తరుణంలో మంగళవారం నలుగురు జడ్పీటీసీ సభ్యులు మంత్రికి వ్యతిరేకంగా జడ్పీ సమావేశంలో గళం విప్పి తమను అణగదొక్కేస్తున్నారని ఆరోపించారు. పుత్తూరు మున్సిపల్ కౌన్సిలర్‌గా వున్న దళిత మహిళ భువనేశ్వరి ఏకంగా అవినీతి ఆరోపణలే చేశారు. చైర్‌పర్సన్ పదవి కోసం తన నుంచీ రూ. 40 లక్షలు తీసుకున్నారని, పదవి ఇవ్వకపోగా తీసుకున్న డబ్బు కూడా వెనక్కు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆమె చేసిన ఆరోపణలు జిల్లావ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించాయి. ఎన్నికల సమయంలో సొంత పార్టీ మహిళా నాయకురాలే ఈ ఆరోపణ చేయడం అధికార పార్టీని ఇరుకునపెట్టింది.

రోజాకు టికెట్ వద్దు... ఇస్తే ఓడిపోవడం ఖాయం

మంత్రి రోజాకు ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్ ఇవ్వవద్దని సీఎం జగన్‌ను కోరారు వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి. చిత్తూరులో జడ్పీ సమావేశం అనంతరం ఆయన నింద్ర జడ్పీటీసీ మల్లీశ్వరితో కలసి మీడియాతో మాట్లాడారు. 2012లో తాను వడమాలపేట మండల వైసీపీ కన్వీనర్‌గా నియమితున్నయ్యానని, 2014 ఎన్నికల్లో తమ మండలంలో వైసీపీకి 1550 ఓట్లు మెజారిటీ తెప్పించామన్నారు. ఆ ఎన్నికల్లో రోజా 858 ఓట్లతో గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు. 2014లో తాను వడమాలపేట ఎంపీపీ అయ్యానని, పార్టీ కోసం కష్టపడి పనిచేశానన్నారు. ఆ కారణంగా 2019 ఎన్నికల్లో తమ మండలంలో వైసీపీకి 3330 మెజారిటీ వచ్చిందని,





అప్పుడు కూడా రోజా గెలిచింది కేవలం 2800 ఓట్లతోనని గుర్తు చేశారు. రెండుసార్లు ఆమె గెలుపునకు తానే కారణమన్నారు. దానికి ప్రతిఫలం తమకు నిధులు రానివ్వకుండా చేయడం, గది లేకుండా చేయడం, అరెస్టులు చేయించడమా అని ప్రశ్నించారు. జగన్‌ను చూసి ఆమె గెలుపుకోసం పనిచేశామని, ఆయన రోజాకు మంత్రి పదవి కూడా ఇచ్చారని అయినా ఆమె తీరు మారలేదన్నారు. తమను వేధిస్తోందన్నారు. ఈసారి టికెట్ ఇస్తే ఓడిపోతుందని జగన్‌కు చెప్పాము. ఆయన మౌనంగా వున్నారని, అయినా మీడియా ద్వారా జగన్‌కు మళ్లీ చెబుతున్నామన్నారు. నగరిలో వేరే ఎవరికి టికెట్ ఇచ్చినా గెలుస్తారని, రోజాకు ఇస్తే మాత్రం ఓడిపోవడం ఖాయమన్నారు.

పదవి కోసం ఇచ్చిన డబ్బులు తిరిగివ్వాలన్నపుత్తూరు కౌన్సిలర్

అణగదొక్కేస్తున్నారని జడ్పీ మీటింగులో సభ్యుల మాటల దాడి

టికెట్ ఇస్తే ఓడిపోవడం ఖాయమని వెలుపల వ్యాఖ్యలు

మంత్రిపై సొంత పార్టీలో మరింత పెరిగిన వ్యతిరేకత



తిరుపతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):పుత్తూరు మున్సిపల్ ఎన్నికల్లో చైర్‌పర్సన్ పదవి కోసం రోజాను సంప్రదించగా రూ. 70 లక్షలు అడిగారని, తాను మూడు విడతలుగా ఆమె సోదరుడు కుమారస్వామిరెడ్డి పంపిన మనిషి వద్ద రూ. 40 లక్షలు అందజేశానని 17వ వార్డు వైసీపీ కౌన్సిలర్ భువనేశ్వరి మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆరోపించారు. తన వద్ద డబ్బు తీసుకుని కూడా తనకు పదవి కేటాయించలేదని, రెండున్నరేళ్ళ తర్వాత ఇస్తామని నమ్మించారని ఆమె ఆరోపించారు. గతేడాది సెప్టెంబరుతో రెండున్నరేళ్ళ గడువు పూర్తయిందని అయినా పదవి ఇవ్వకపోగా తీసుకున్న డబ్బు కూడా వెనక్కు ఇవ్వడం లేదని ఆరోపించారు. మంత్రి రోజాను అడిగితే ఆమె సోదరుని అడగమని చెబుతున్నారని, ఆయన్ను అడిగితే డబ్బులు ఇవ్వకపోగా ఆయన అనుచరులు వేధిస్తున్నారని వాపోయారు. దళిత మహిళనైన తనకు సీఎం జగన్ న్యాయం చేయాలని కోరారు.ఇదిలా వుండగా చిత్తూరులో జరిగిన జడ్పీ సమావేశంలో నగరి, వడమాలపేట, నింద్ర, పుత్తూరు జడ్పీటీసీ సభ్యులు తమకు మండలాల్లో ఎలాంటి ప్రాధాన్యతా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయాల్లో గదులు కూడా కేటాయించలేదని,అభివృద్ధి పనులకు నిధులు కూడా ఇవ్వడం లేదన్నారు. జడ్పీలో పనులు మంజూరు చేయించుకున్నా మంత్రి ఇంజనీరింగ్ అధికారులకు చెప్పి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై జడ్పీ సమావేశాల్లో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. చివరికి డిప్యూటీ సీఎం నారాయణస్వామికి, మంత్రి పెద్దిరెడ్డికి ఫిర్యాదు చేసినా వారు కూడా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రత్యర్థుల దాడికంటే సొంత పార్టీ నేతల నుంచే మంత్రి రోజా ఎక్కువగా దాడికి గురవుతున్నారు. సొంత నియోజకవర్గంలో తన పార్టీ నుంచే తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో రోజాకు, పలు మండలాల్లోని పార్టీ నేతలకూ నడుమ విభేదాలు పొడసూపాయి. అవి కాలక్రమేణా అంతరం పెంచాయి. ఆమెను వ్యతిరేకిస్తూ బలమైన నేతలు బహిరంగ కార్యకలాపాలు సాగించారు. ఆమెకు టికెట్ ఇవ్వొద్దని అధినేతను పదేపదే కోరారు. అధినేత కూడా ఆమె వ్యతిరేక వర్గానికి చెందిన కేజే శాంతికి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టు, రెడ్డివారి చక్రపాణిరెడ్డికి శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్ పదవిని కట్టబెట్టడం ఆమెకు షాక్ ఇచ్చింది. అయితే ఎన్నికలు సమీపించాక అధినేత ఆమె పట్ల ప్రసన్నంగా వుండి టికెట్ విషయంలో అభయం ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. వ్యతిరేకవర్గం కూడా మౌనంగా వుండడంతో ఆమె టికెట్‌కు ఢోకా లేదని, వ్యతిరేకవర్గం కూడా కాస్త తగ్గినట్టు అందరూ భావించారు. కానీ మంగళవారం నాటి పరిణామాలు సొంత పార్టీలో ఆమె పట్ల వ్యతిరేకత తగ్గకపోగా తారస్థాయికి చేరినట్టు నిరూపించాయి. ఆధిపత్యంలో ఒకరినొకరు దెబ్బతీసుకోవడం సహజమే అయినా సొంత పార్టీకి చెందిన దళిత మహిళా కౌన్సిలర్ తనకు పదవి ఇస్తామని మంత్రి డబ్బు తీసుకున్నారని ఆరోపించడం వైసీపీలో కలకలం రేపింది. డబ్బు తీసుకుని పదవి ఇవ్వకపోగా తీసుకున్న డబ్బు కూడా వాపస్ చేయకుండా వేధిస్తున్నారని ఆరోపించడం అధికార పార్టీని ఆత్మరక్షణలో పడేసింది.మంత్రి రోజాపై ఆ ఆరోపణలు తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.టికెట్ అవకాశాలు చేజారినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సొంత పార్టీ దళిత మహిళా నేత చేసిన ఆరోపణలు ప్రత్యర్థి పార్టీలకు ఎన్నికల్లో ప్రధాన ప్రచారాస్త్రాలుగా మారనున్నాయి. అవి ఆమెను, పార్టీని కూడా ఇరుకున పెడతాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి సరిగ్గా ఎన్నికల తరుణంలో ఈ పరిణామాలు మంత్రి రోజాను తీవ్రంగా ఇబ్బంది పెట్టే పరిస్థితులే కనిపిస్తున్నాయి.

ఆత్మరక్షణలో అధికార పార్టీ నేతలు

స్విమ్స్‌లో 26న ఓపీ, ఓటీ సేవలకు సెలవు

తిరుపతి సిటీ, జనవరి 23 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న స్విమ్స్‌లో ఓపీ, ఓటీ సేవలకు సెలవు ప్రకటిస్తున్నట్లు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం అత్యవసర సేవలు మాత్రమే కొనసాగుతాయని వివరించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

టక్కరి పోలీస్

- కానిస్టేబుల్ అవతారమెత్తిన సెక్యూరిటీ గార్డు
- యూనిఫాం, ప్రభుత్వ వాహనంతో హల్‌చల్



పోలీస్ యూనిఫాంలో అజయ్

శ్రీకాళహస్తి, జనవరి 23: ఒక ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు సినీఫక్కీలో కానిస్టేబుల్ అవతారమెత్తాడు. అధికారులతో స్నేహం చేస్తూ దర్జాగా ప్రభుత్వ జీపులోనే మూడేళ్ల పాటు హల్‌చల్ చేశాడు. కానిస్టేబుల్ యూనిఫామ్ ధరిస్తూ ప్రజలందరినీ నమ్మించాడు. వసూళ్లపర్వంలో అతడి అత్యుత్సాహం అసలు పోలీస్ సిబ్బందిలో అసహనం పెంచింది. దీంతో ఈ టక్కరి పోలీస్ తతంగాన్ని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ఇన్నాళ్లూ అతడిని నిజమైన పోలీసుగా భావించిన జనం కంగు తిన్నారు. శ్రీకాళహస్తి పట్టణం కొండమిట్టకు చెందిన అజయ్ ముక్కంటి ఆలయంలో నాలుగేళ్ల క్రితం ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా చేరాడు. భక్తులతో దురుసు ప్రవర్తన కారణంగా రెండు నెలలకే అక్కడినుంచి సాగనంపారు.తిరుమలలో అతడి మామ నాలుగేళ్ల క్రితం సెక్యూరిటీ టెండరు దక్కించుకోవడంతో అజయ్ కొంతకాలం అక్కడ పనిచేశాడు. పోలీసుశాఖ ఉత్సవాల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని తీసుకునేది.మూడేళ్ల క్రితం మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా 12మంది ట్రాఫిక్ నియంత్రణ కోసం శ్రీకాళహస్తికి వచ్చారు.వారిలో వున్న అజయ్ కుమార్ శ్రీకాళహస్తిలోని కొందరు పోలీసు అధికారులతో స్నేహం ఏర్పరచుకున్నారు. కొద్దిరోజుల తర్వాత అజయ్ మామకు సెక్యూరిటీ కాంట్రాక్టు ముగిసింది.దీంతో అజయ్ శ్రీకాళహస్తిలో ఓ అధికారి పంచన చేరాడు. అజయ్‌ని ఆయన తన ప్రైవేటు డ్రైవర్‌గా అధికారి అందరికీ పరిచయం చేశాడు.కొద్ది నెలలపాటు ఆయన వెంటే జీపు నడుపుతూ గడిపేవాడు.వాహనాల తనిఖీలు కూడా చేసేవాడు. అధికారితో స్నేహంగా ఉండడంతో కానిస్టేబుళ్లు ప్రశ్నించేవారు కాదు. మెల్లగా అజయ్‌కు ధీమా ఏర్పడింది. ఇక ఎవ్వరూ అడగరు అన్న ధైర్యంతో యూనిఫామ్ ధరించాడు. హోంగార్డులు సైతం పోలీసు లోగోను ధరించడం నేరం.జంగిల్ షూస్ అనేది కేవలం గ్రేహౌండ్స్ శిక్షణ పొందిన సిబ్బంది మాత్రమే ఉపయోగించాలి. ప్రస్తుతం అలాంటి వారు జిల్లాలో 41 మంది మాత్రమే ఉన్నారు.అయితే అజయ్ అందరికీ భిన్నంగా ఖరీదైన యూనిఫామ్ వేసేవాడు. సినిమా హీరోలా నల్ల కళ్లజోడు ధరించేవాడు.డ్రైవరుగా అవకాశమిచ్చిన అధికారి ఏడాదిన్నర క్రితం బదిలీ అయ్యారు. ఆ తర్వాత ఓ ఏఎస్ఐతో జత కట్టిన అజయ్ పోలీస్‌గా చలామణి అయ్యాడు. ఈ సమయంలో మరో అధికారితో పరిచయం బలపడి ఆయన చెంత తిష్ట వేశాడు. ప్రభుత్వ జీపు దొరకడంతో సరదాగా టీ తాగే దగ్గర నుంచి ఇంటి సరుకులు తీసుకెళ్లే వరకూ పోలీస్ వాహనంలోనే తిరిగేవాడు. సినిమా హాళ్లు, రెస్టారెంట్లు, హోటళ్లు, మాంసపు దుకాణాల్లో దర్జాగా వసూళ్లకు పాల్పడేవాడు. అధికారి వాహనంలో వస్తుండడంతో హోటళ్ల నిర్వాహకులు అడిగినప్పుడంతా ఆహారపు పార్శిళ్లు అందజేసేవారు. స్టేషన్లో సిబ్బందికి తరచూ టిఫిన్లు, భోజనాలు ఉచితంగా తీసుకొస్తుండడంతో ఎవరూ ఈ అనధికారిక పోలీసును ప్రశ్నించలేదు.ఏడాదిన్నర కాలం అధికార దర్పం ప్రదర్శించిన అజయ్ స్టేషన్లో కొందరిని ధిక్కరించే స్థాయికి చేరుకోవడంతో ఇతగాడి నిజస్వరూపాన్ని ఎవరో సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు.చూసిన జనమంతా కంగుతిన్నారు.ఉన్నతాధికారులు విచారిస్తే ఎవరి మెడకు ఉచ్చు బిగుసుకుంటుందో అన్న ఆందోళన కొందరు అధికారుల్లో కన్పిస్తోంది.

మీ ఇష్టారాజ్యం కుదరదు!

- కార్యకర్తల ఇండ్లకున్న టీడీపీ పోస్టర్లు తొలగించడంపై శ్రేణుల నిరసన



మంగళం సచివాలయం వద్ద టీడీపీ శ్రేణులతో కలసి బైఠాయించిన సుధారెడ్డి

తిరుపతి (రవాణా), జనవరి 23 : చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని మంగళంలో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది.టీడీపీ కార్యకర్తలు తమ ఇళ్లకు వేసుకున్న పార్టీ వాల్‌పోస్టర్లను మంగళవారం పంచాయతీ సిబ్బంది తొలగించడంపై టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి.చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నానీ సతీమణి సుధారెడ్డి ఎస్‌సీబీఎన్ కాలనీకి చేరుకుని వాల్‌పోస్టర్లను ఎందుకు తొలగిస్తున్నారంటూ పంచాయతీ సిబ్బందిని ప్రశ్నించారు. హోర్డింగులు, బ్యానర్లు కట్టరాదంటూ జీవో ఉందని వాల్‌పోస్టర్లు అతికించాలంటే ముందస్తు అనుమతి తీసుకుని పన్ను చెల్లించాలని కార్యదర్శి సమాధానం ఇచ్చాడు.అయితే తామేం హోర్డింగ్‌లు, బ్యానర్లు కట్టలేదని తమ పార్టీ కార్యకర్తల ఇళ్లకు నానీ వాల్‌పోస్టరు అతికించుకుంటే తొలగించే హక్కు ఎవరు ఇచ్చారంటూ సుధారెడ్డి ప్రశ్నించారు. మంగళం సచివాలయంలో వైసీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఫొటో ఎవరి అనుమతితో పెట్టారని నిలదీశారు.ఎమ్మెల్యే చెవిరెడ్డి సొంత రాజ్యాంగం నడుస్తోందంటూ విమర్శించారు. సొంత ఖర్చుతో తాము వాల్‌పోస్టర్లు వేసుకోకూడదని రాతపూర్వకంగా తమకు ఇచ్చే వరకు వెళ్లబోమంటూ సచివాలయం ముందు పార్టీ కార్యకర్తలతో కలిసి సుధారెడ్డి బైఠాయించారు.ఈ విషయం తెలుసుకున్న వైసీపీ శ్రేణులు కూడా అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. దాదాపు రెండు గంటల తరువాత పంచాయతీ కార్యదర్శి రాజేష్ రాతపూర్వకంగా పత్రాన్ని సుధారెడ్డికి ఇచ్చారు. నిజానికి పంచాయతీ పరిధిలో వైసీపీ వాల్‌పోస్టర్లు కూడా ఉన్నాయి. వాటికి లేని ముందస్తు అనుమతి టీడీపీ పోస్టర్లకు మాత్రం ఎందుకు తీసుకోవాలని టీడీపీ శ్రేణులు ప్రశ్నించాయి.



నానీ వాల్‌పోస్టర్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

జర్నలిస్టును అడ్డుకున్న వైసీపీ నాయకులు

ఈ సంఘటనను కవర్ చేయడానికి వెళ్లిన ఏబీఎన్ ఛానల్ ప్రతినిధిని వైసీపీ నేతలు అడ్డుకున్నారు. వాల్‌పోస్టర్లను తొలగించిన తీరుపై పంచాయతీ కార్యదర్శి రాజేష్‌ను, ఈవో పీఆర్డీ గిరిధర్‌ను ప్రశ్నలు అడుగుతున్న సమయంలో వైసీపీ నాయకులు పెద్దగా కేకలు పెట్టడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది.సర్దిచెప్పాల్సిన పోలీసులు కూడా ప్రేక్షకపాత్ర పోషించడం విమర్శల పాలైంది.

ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు బతకాలా? వద్దా?

తిరుపతిలో యాజమాన్యాల నిరసన



యూనివర్సిటీ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రైవేట్ డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 23: ప్రైవేట్ డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు మంగళవారం ఎస్వీయూ మెయిన్ గేట్ వద్ద శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. పరిపాలనా భవనం వరకూ ర్యాలీ నిర్వహించాయి. వీసీ శ్రీకాంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశాయి. ప్రైవేట్ డిగ్రీ కాలేజీ అసోసియేషన్ నాయకులు విజయభాస్కరరెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, శేషారెడ్డి మాట్లాడుతూ ఏఐసీటీఈ-2024 నోటిఫికేషన్, హ్యాండ్ బుక్ నిబంధనలను పరిశీలిస్తే భవిష్యత్తులో ప్రైవేట్ డిగ్రీ కాలేజీల నిర్వహణ కష్టతరంగా మారే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. బీబీఏ, బీసీఏ, బీహెచ్ఎం కోర్సును నిర్వహించడానికి ఒక్కో కోర్సుకు రూ.5 లక్షల సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉందన్నారు. ఒక్కో కోర్సుకు ప్రాసెసింగ్ ఫీజు రూ.1.25 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. లీజు బిల్డింగ్‌లో ఉన్న కాలేజీలు ఒక్క కోర్సుకు రూ.5 లక్షలు కచ్చితంగా చెల్లించాల్సి ఉందన్నారు. ఏ ఇంజనీరింగ్ కాలేజీ అయినా ఎంబీఏ, ఎంసీఏ, బీబీఏ, బీహెచ్ఎం, బీసీఏ కోర్సులు కొత్తగా నమోదు చేసుకునే అవకాశం కల్పించారని అన్నారు. దీనిపై క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించకుండా ఏకపక్షంగా నిర్ణయించడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని, లేకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని అన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 31న విజయవాడలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ప్రైవేట్ డిగ్రీ యాజమాన్యాలకు చెందిన డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, డాక్టర్ ఆర్సీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి జేఈఈ మెయిన్స్

3కేంద్రాలో పరీక్షలు రాయనున్న 12,033మంది విద్యార్థులు

తిరుపతి(విద్య) జనవరి 23 : జాతీయ స్థాయిలో ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐటీ విద్యాలయాల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. తిరుపతి జిల్లాలో మూడు కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షలకు 12,033మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని సిటీ కోఆర్డినేటర్ టికైలాష్ పేర్కొన్నారు. నిర్ణీత తేదీలలో రెండు సెషన్‌లలో ఉదయం 9-12గంటల వరకు, మధ్యాహ్నం 3-6గంటల వరకు ఈ పరీక్షలు ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యార్థులు ఎన్టీఏ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లెలోని అయాన్ డిజిటల్, రామిరెడ్డిపల్లెలోని అయాన్ డిజిటల్, పుత్తూరు ఎస్వీ పెరుమాళ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

28న తిరుపతికి షర్మిల

తిరుపతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల 28వ తేదీన తిరుపతిలో పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు. 27వ తేదీ రాత్రికే తిరుపతి చేరుకుని మరుసటిరోజు ఉదయం 10 నుంచీ మధ్యాహ్నం 12 గంటల వరకూ శ్రేణులతో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం బయల్దేరి అనంతపురం వెళ్లనున్నారు.

సమస్యలు పరిష్కరించాలని సెర్ప్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న సెర్ప్ ఉద్యోగులు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 23 : తమ సమస్యలు పరిష్కరించాలని తిరుపతిలో సెర్ప్ ఉద్యోగులు మంగళవారం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ 23 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్నామన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని మూడేళ్లుగా విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెర్ప్‌ను ప్రభుత్వ సంస్థగా గుర్తించి అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు కేడర్ ఫిక్స్ చేసి, పేస్కేల్ అమలు చేయాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62సంవత్సరాలకు పెంచాలన్నారు. రూ.16 లక్షల గ్రాట్యుటీ, హెచ్‌ఆర్‌పీ జీవోను అమలు చేయాలని కోరారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

బావిలోపడి మహిళ మృతి

● ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

తిరుపతి(నేరవిభాగం), జనవరి 23 : బావిలో పడి మహిళ మృతి చెందిన ఘటన తిరుపతి రూరల్ చెర్లోపల్లిలో చోటుచేసుకుంది. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన మంగళవారం వెలుగుచూసింది. రూరల్ పోలీసుల వివరాల ప్రకారం... చెర్లోపల్లికి చెందిన వెంకటేష్ భార్య వాణి ఈనెల 20వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. బంధువులు, తెలిసిన వారిని వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. ఆ తర్వాత రెండు రోజులైనా ఆమె సమాచారం తెలియకపోవడంతో 22వ తేదీన తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, మంగళవారం చెర్లోపల్లి సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో వాణి శవమై తేలింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ నిధుల సాధనే లక్ష్యంగా..



సుబ్బరామయ్య సన్మానిస్తున్న దృశ్యం

తిరుపతి(కొర్లగుంట), జనవరి 23 : గ్రామ పంచాయతీల నిధుల సాధనే లక్ష్యంగా రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్రహ్మణ్యం నాలుగేళ్లుగా అవిశ్రాంతంగా పోరాడుతున్నారని వక్తలు కొనియాడారు. ఆదివారం విజయవాడలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.బి.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచుల సంఘం నాయకులు ఆయనను అభినందించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సుబ్బరామయ్య తిరుపతికే పరిమితం కాకుండా అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచుల నిధుల కోసం ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీముత్యాలరావు, ప్రతాప్‌రెడ్డి, మునిరెడ్డి, ముత్యాలరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత తిరుపతి డైనమాస్ క్లబ్ జట్టు



విజేత జట్టును సన్మానిస్తున్న దృశ్యం

తిరుపతి (కొర్లగుంట), జనవరి 23 : కర్నూలు జిల్లాలో నిర్వహించిన జోనల్ స్థాయి కోరమండల్ ఫుట్‌బాల్ క్లబ్బుల ఛాంపియన్‌షిప్‌ను తిరుపతి డైనమాస్ క్లబ్ జట్టు కైవసం చేసుకుంది. కర్నూలు, చిత్తూరు, తిరుపతి జిల్లాల తరపున మూడు జట్లు ప్రాతినిధ్యం వహించాయి. తుదిపోరులో నెల్లూరు జట్టుపై తిరుపతి జట్టు ఘన విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందింది.

సంగీత, సాహిత్యాలలో ప్రజ్ఞాశాలి అనంతకృష్ణశర్మ



తిరుపతి (కల్చరల్), జనవరి 23: రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ సంగీత, సాహిత్యాలలో ప్రజ్ఞాశాలి అని ఆయన మనమరాలు, సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు రాళ్లపల్లి దీప్తి అన్నారు. తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలను పరిష్కరించి గ్రంథస్తం చేయడంలో విశేషంగా కృషిచేసిన సంగీత, సాహిత్య విద్వాంసులు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ 131 జయంతిని మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ రాళ్లపల్లికి సంగీత సాహిత్యాలు రెండు కళ్లవంటివన్నారు. అందువల్లనే అన్నమయ్యకు చెందిన వందలాది కృతులను స్వరపరచగలిగారన్నారు. రాళ్లపల్లి ప్రద్యుమ్న మాట్లాడుతూ రాళ్లపల్లికి అనేక భాషలు తెలిసి ఉండడం, రాయలసీమ వాడు కావడం, శ్రీవైష్ణవంపై అవగాహన ఉండడం వలన సంకీర్తలను పరిష్కరించడం, స్వరపరచడం సులభమైందన్నారు. అంతకు ముందు ఉదయం 10 గంటలకు శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మార్గంలోని రాళ్లపల్లి శిలా విగ్రహానికి కుటుంబ సభ్యులు, టీటీడీ అధికారులు, సాహిత్య అభిమానులు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.

కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్‌కు అవార్డు





పురస్కారం అందుకుంటున్న కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్

తిరుపతి(విద్య) జనవరి 23 : ఎమ్మార్‌పల్లిలోని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీధర్‌కు హైదరాబాద్‌కు చెందిన ఆమ్ బిషన్స్ జాతీయ స్థాయి కెరీర్ కౌన్సెలింగ్ కన్సల్టెన్సీ సంస్థ ఆధ్వర్యంలో లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో (క్యాట్, క్లాట్, బ్యాంక్, జీఆర్‌ఈ) తిరుపతి కేంద్రంగా 17సంవత్సరాలుగా అత్యుత్తమ శిక్షణ ఇస్తూ ఎందరో విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్నందుకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు ప్రకటించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డితో ఆమ్ బిషన్స్ ఎండీ సాయిరామ్ అర్జున్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. శ్రీధర్ మాట్లాడుతూ ఈ అవార్డు లభించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కౌటిల్య సీనియర్ మేనేజర్ ఎంఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ తొలగింపుపై నిరసన

అవిలాల పంచాయతీ శానప్పకాలనీ వాసుల ఆందోళన





సంఘటనా స్థలంలో ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు - నిరసన తెల్పుతున్న శానప్ప కాలనీ వాసులు

తిరుపతి రూరల్, జనవరి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించడం పట్ల అవిలాల పంచాయతీ శానప్ప కాలనీ వాసులు నిరసన తెలియజేశారు. విగ్రహాన్ని తొలిగించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. శానప్ప కాలనీ వాసులు మాట్లాడుతూ అవిలాల సర్వే నెంబరు-146లో 57 సెంట్ల విస్తీర్ణం గల భూమి ఉందన్నారు. ఈ కాలువ పోరంబోకు భూమిలో ప్రభుత్వ కార్యక్రమాలు, గ్రామానికి సంబంధించిన వినాయక చవితి వంటి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ భూమికి సమీపంలోనే ఆరు ఎకరాల హథీరాంజీ మఠం భూమి ఆక్రమణకు గురైందని తెలిపారు. ఈ క్రమంలో ఈ భూమిపైనా కన్నేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో మూడు నెలలుగా వివాదం నడుస్తూ ఉందన్నారు. ఈ భూమిని ఎలాగైనా రక్షించుకోవాలనే ఆలోచనతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. సోమవారం అర్ధరాత్రి అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమణకు గురికాకుండా చూడాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రం చేస్తామని స్పష్టం చేశారు.

నేడు తిరుపతికి సీఎం

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 23: ముఖ్యమంత్రి జగన్ బుధవారం సాయంత్రం తిరుపతికి రానున్నారు. తిరుచానూరు సమీపంలోని తాజ్ హోటల్‌లో జరుగుతున్న ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాల్గొంటారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న సంస్కరణలపై ప్రసంగించనున్నారు. తిరిగి 5.30 గంటలకు సీఎం జగన్ తిరుగు పయనం కానున్నారు.కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీపరమేశ్వరరెడ్డి మంగళవారం సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : బీటీఏ

పాకాల, జనవరి 23: దీర్ఘకాలంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ బాగ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని, 11వ పీఆర్సీ డీఏ అరియర్స్ చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ లోన్‌లు మంజూరు చేయాలని, లీవు బకాయిలు విడుదల చేయాలని, 1వ తేదీనే జీతాలు చెల్లించాలని కోరారు. పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. బీటీఏ నాయకులు ఆంజినేయులు, రామ్మూర్తి, జయబాల, విశ్వనాథం, పి.వెంకటయ్య, విజయమోహన్, జ్యోతి, రాజేంద్రుడు, గణేష్, శివప్రసాద్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చంద్రగిరిలో 'గడప గడపకూ'

చంద్రగిరి, జనవరి 23: చంద్రగిరిలోని రెడ్డివీధి, ముకుందవీధి, మూలస్థాన ఎల్లమ్మ వీధిలలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, సర్పంచ్ రూపారామ్మూర్తి పాల్గొన్నారు.

సంఘటితమై టీడీపీని గెలిపిద్దాం

జయహో బీసీలో వక్తలు



ఐక్యత చాటుతున్న నేతలు

తిరుపతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఎన్నికల్లో బీసీలంతా సంఘటితంగా ఉండి టీడీపీని గెలిపించుకోవాలని నేతలు కోరారు. మంగళవారం స్థానిక కపిలతీర్థం సమీపంలోని పార్టీ కార్యాలయంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి సురేంద్రకుమార్ మాట్లాడుతూ వారసత్వపరంగా బీసీలు శ్రమజీవులన్నారు. ఆర్థిక వనరులు లేక కులవ్యవస్థనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. శ్రమతోనే ప్రగతి సాధ్యమని నమ్మి బీసీల ఎదుగుదలలో టీడీపీ తొలినుంచి ముందుందన్నారు. బీసీలకు రక్షణ చట్టం తెచ్చి వారికి అన్నివిధాలా అండగా నిలవాలని టీడీపీ నిశ్చయించుకుందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు రిజర్వేషన్లు తగ్గించి, పదవులను రద్దుచేసి, కులవృత్తులను కునారిల్లేలా చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకించారని 75 మంది బీసీ నాయకులను పొట్టనపెట్టుకున్నారన్నారు. టీటీడీ ఛైర్మన్ పదవిని బీసీలకు ఇచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. 90 శాతం పదవులు జగన్‌రెడ్డి తన సామాజికవర్గానికే కట్టబెట్టారన్నారు. రుద్రకోటి సదాశివం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దంపూరి భాస్కర్, ఇనుగొండ సుబ్రమణ్యం, విజయలక్ష్మి, దశరథాచారి, కృష్ణయాదవ్, సింధూజ, సుబ్బుయాదవ్, కరాటే చంద్ర, పెరుమాళ్ మధు, రాజయ్య, విశ్వనాథం, జగన్నాథం అశోక్, శ్రీరాములు, ఆర్సీ మునికృష్ణ, చినబాబు, సూరా సుధాకర్ రెడ్డి కుమారమ్మ, అనిత, హేమ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నారా లోకేశ్ జన్మదినం



చంద్రగిరిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి, జనవరి 23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు ఆధ్వర్యంలో టవర్ క్లాక్ వద్ద కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథిగా టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శివకోటేశ్వరరెడ్డి విచ్చేశారు. టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా, చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా, టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి వీరంగారి రమేష్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్, తుడా మాజీ డైరెక్టర్ బాలకృష్ణమూర్తి, నాయకులు నారా ప్రతాప్‌నాయుడు, తులసేశ్వర‌రెడ్డి, ధనంజయరెడ్డి, సునీల్, పార్లమెంట మహిళా ఉపాధ్యక్షురాలు లంకెళ్ల లలిత, బెల్లంకొండ రమేష్‌రాయల్, జగన్మోహన్‌నాయుడు, రాకేష్‌చౌదరి, సజ్జా పురుషోత్తం, సుశీలమ్మ, అమ్ములు, సునీత, వడ్లమూడి రాధ, భూలక్ష్మి, రాధాసునీల్, వెంకటముని, కోట లోకేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

భాకరాపేటలో

చిన్నగొట్టిగల్లు మండలం కోటబైలు గ్రామంలో నిర్వహించిన లోకేశ్ జన్మదిన వేడుకల్లో టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, కార్యదర్శి మదనమోహన్, నాయకులు ఆర్వీ రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, మునిస్వామినాయుడు, కుమారస్వామిరెడ్డి, మౌలాలి, వెంకటరత్నం, డిష్ మణి, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, సుబ్రమణ్యం, విజయ, శేఖర్‌గౌడ్, హైదర వల్లి, మస్తాన్ బాషా, రఫీ, సహదేవరెడ్డి, చలపతి, ముత్యాలు, చంద్రబాబు, రమేష్, గురుమూర్తి, జేడీ బాలాజి, మల్లికార్జునరెడ్డి, తులసిరాయల్, రాజగోపాల్‌నాయుడు, మణికంఠరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల: మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం ఎదుట కేక్ కట్ చేశారు.

తిరుపతి రూరల్: దుర్గ సముద్రంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిశేఖర్ రాయల్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. బాబురాయల్, రవి, చంద్రశేఖర్, నగరం బాబు, డిల్లీ, శంకర్, సుధాకర్ పాల్గొన్నారు.

తిరుచానూరు: మండలంలోని బ్రాహ్మణపట్టు పంచాయతీ గంగనగుంట గ్రామంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రావెళ్ల సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

రామచంద్రాపురం, జనవరి 23: టీడీపీ నాయకులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు జనార్దన్ చౌదరి, ఉమాపతినాయుడు, నరసింహారెడ్డి, హరిప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, ధనంజయరెడ్డి, మండల నాయకులు ప్రసాద్, గిరినాయుడు, మహేష్‌నాయుడు, న్యాయవాది మునెయ్య, నారాయణరెడ్డి, ధనంజయ, మాధవయ్య పాల్గొన్నారు.

టీడీపీలో అన్ని వర్గాలకూ సముచిత స్థానం



టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న మురళి

భాకరాపేట, జనవరి 23: టీడీపీలో అన్ని వర్గాలకు సముచితస్థానం ఉంటుందని టీడీపీ మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం కోటబైలు పంచాయతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహానాడులో ప్రకటించిన పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి మదనమోహన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన : తుడా చైర్మన్



మాట్లాడుతున్న మోహిత్ రెడ్డి

పాకాల, జనవరి 23: సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమని తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. మండలంలో మంగళవారం ఆయన 'జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. గాదంకి, కావలివారిపల్లె, కే.వడ్డెపల్లె, ఐరంగారిపల్లె పంచాయతీలలో వైసీపీ జెండాలను ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే ఎన్ఆర్ జయదేవనాయుడు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన

రామచంద్రాపురం, జనవరి 22: మండలంలోని రాయలచెరువు గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను తిరుపతి జిల్లా ప్రాజెక్టు మేనేజరు షణ్ముఖం ఆధ్వర్యంలో రాజస్థాన్‌కు చెందిన నేచురల్ ఫామింగ్ ప్రతినిధులు 11 మంది మంగళవారం సందర్శించారు. డీపీఎంను అడిగి విధివిధానాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, మండల టీం లీడర్లు విమల, ఎంటీ రాగమ్మ, యూనిట్ ఇన్‌చార్జిలు, ఫార్మా సైంటిస్టులు, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

సొంత గూటికి హరికృష్ణ



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుధారెడ్డి

తిరుచానూరు, జనవరి 23: పాకాల మండలం మొగరాల పంచాయతీ జంగాలపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణ మంగళవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనకు సుధారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

జాడలేని గణేష్

ఎర్రావారిపాళెం, జనవరి 23: చెరువులో గల్లంతైన గణేష్ ఆచూకీ మూడు రోజులైనా ఇంతవరకు లభ్యం కాలేదు. మండలంలోని చింతగుంట పంచాయతీ ఆదిఆంధ్రవాడకు చెందిన గల్లా గణేష్ ఆదివారం తన ఊరి వారితో కలిసి సమీపంలోని రెడ్డిచెరువులో చేపల వేటకు వెళ్లాడు. వారు వద్దని వారించినా తెలియకుండా దుస్తులు గట్టు మీద పెట్టి అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి అతడి కోసం గాలింపు చేపట్టారు. మంగళవారం సైతం సర్పంచ్ కంచన లోకేష్ 50 మందితో దగ్గరుండి గాలింపు చేపట్టారు. పీలేరు నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది సైతం చెరువులో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అయినా గణేష్ జాడలేదు. గురువారం తిరుపతి నుంచి గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టనున్నట్లు సర్పంచ్ తెలియజేశారు.

కాంగ్రెస్‌తోనే ఏపీకి ప్రత్యేక హోదా సాధ్యం

పీసీసీ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి

చంద్రగిరి, జనవరి 23: ఏపీకి ప్రత్యేక హోదా సాధించడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పీసీసీ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం చంద్రగిరిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు టవర్ క్లాక్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ వాసు ఆధ్వర్యంలో చంద్రగిరికి చెందిన ఆకుల నవీన్‌కుమార్‌రెడ్డి 50 మంది కార్యకర్తలతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి వేణుగోపాల్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పీసీసీ సెక్రటరీ జనరల్ సెక్రటరీ నరసింహులు, డీసీసీ సెక్రటరీ పరమేశ్వరి, ఉషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొణిదల రాజేంద్ర, మునికృష్ణయ్య, మోహన్‌రెడ్డి, చిన్ని, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆదాయపన్ను అధికారులంటూ

గాదంకి టోల్ ప్లాజా వద్ద ఘర్షణ

హోటల్ ధ్వంసం, యజమానిపై దాడి





దాడిలో గాయపడిన సారథి - వాహనానికి ప్రభుత్వ వాహనంగా ఉన్న దృశ్యం

చంద్రగిరి, జనవరి 23: గాదంకి టోల్‌ప్లాజా వద్ద సోమవారం రాత్రి ఆదాయపన్ను అధికారులంటూ కొందరు హోటల్ వద్ద ఘర్షణకు దిగారు. హోటల్‌ను ధ్వంసం చేసి నిర్వాహకులపై దాడికి పాల్పడ్డారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని పాకాలవారిపల్లెకు చెందిన అలేఖ్య టోల్‌ప్లాజా వద్ద హోటల్ నడుపుతోంది. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో హోటల్ మూసివేసే క్రమంలో ప్రభుత్వ వాహనం అని రాసి ఉన్న ఏపీ03ఏఎస్6123 నెంబర్ గల కారులో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఆదాయపన్ను శాఖ అధికారులమని టేబుల్ శుభ్రం చేయాలని చెప్పారు. హోటల్ మూసివేస్తున్నామని నిర్వాహకులు తెలపడంతో హోటల్ ఎందుకు పెట్టారు అంటూ వాదనకు దిగారు. ఇరు వర్గాల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో అలేఖ్యపై దాడికి పాల్పడ్డారు. అనంతరం రెండు వాహనాల్లో కొంతమంది యువకులు వచ్చి హోటల్ నిర్వాహకుడు సారథిపై గాజు బాటిళ్లతో తలపై దాడి చేశారు. హోటల్‌ను ధ్వంసం చేశారు. బాధితులు 100కు డయిల్ చేయడంతో వారు పరారయ్యారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాత్రికేయులకు చెవిరెడ్డి క్షమాపణ చెప్పాలి

ఏపీయూడబ్ల్యూజే డిమాండ్


చంద్రగిరి, జనవరి 23: పాత్రికేయులపై విరుచుకుపడుతూ దూర్భాషలాడిన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేంద్ర ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. చంద్రగిరి జర్నలిస్టులను పిలిపించి తనపై వ్యతిరేక వార్తలు రాస్తే కాళ్లు చేతులు విరిచేస్తా అని బెదిరించడం సరైంది కాదన్నారు. పాత్రికేయులను బెదిరించి నోరు నొక్కాలని చూడడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన వ్యాఖ్యలు ఉపసంహరించుకునిక్షమాపణచెప్పేవరకు ఎమ్మెల్యే కార్యక్రమాలకు పాత్రికేయులు నల్ల బ్యాడ్జీలు ధరించి హాజరు కావాలని పిలుపునిచ్చారు. ప్రత్యర్థులపై రాజకీయ విభేదాలు ఉంటే వారు వారు తేల్చుకోవాలని పత్రికా వ్యవస్థపై పడటం సరైంది కాదని హితవు పలికారు.

పాత్రికేయులను బెదిరించడం నా నైజం కాదు : చెవిరెడ్డి

తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో పాత్రికేయులతో సత్సంబంధాలతోనే మెలిగే వ్యక్తినని, దుర్భాషలాడడం, పరుషపదజాలంతో మాట్లాడడం జరగలేదని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్పష్టం చేశారు. పాత్రికేయుల సంక్షేమం కోరుతూ వారితో తాను ఒక స్నేహితుడిగా ఉంటానన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కొందరు కావాలనే తనపై బురదజల్లే కుట్రలో భాగంగా పాత్రికేయులతో వైరం సృష్టించారని పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం ఇళ్లస్థలాల కోసం వచ్చిన కొందరు పాత్రికేయులతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో అవాస్తవాలు పోస్ట్ చేసే ఒక వ్యక్తి గురించి ప్రస్తావించానన్నారు. అతను నిజంగా పాత్రికేయుడైతే పనిచేసే సంస్థలో వార్తలు ఇస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పానన్నారు. నిజమైన పాత్రికేయులను తానెప్పుడూ గౌరవిస్తుంటానన్న విషయం ఏపీయూడబ్ల్యూజే నాయకులకు కూడా తెలుసునని చెప్పారు. ఒక రాజకీయ పార్టీకి పీఆర్వోగా పనిచేస్తూ, జర్నలిస్టుగా చలామణి అవుతున్న వ్యక్తి మాటలు నమ్మడంపై విజ్ఞులైన జర్నలిస్టులు ఆలోచించాలన్నారు.

సమస్యలకు పరిష్కారమేదీ?

● జడ్పీ సమావేశంలో తొలిసారి గొంతెత్తిన జడ్పీటీసీ సభ్యులు



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 23: మండలాల్లో సమస్యలు పరిష్కారం కావడంలేదని పలువురు జడ్పీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. కొన్ని మండలాల్లో తాగునీరు, జగనన్న లేఅవుట్, నాడు-నేడు పనులు జరగడం లేదని వాపోయారు. జడ్పీ సమావేశంలో తొలిసారిగా వీరు సమస్యలపై గొంతెత్తారు. కొత్త పాలకవర్గం ఏర్పాటయ్యాక జరిగిన సమావేశాల్లో ఓ సారి ముగ్గురు ఎమ్మెల్యేలు సమస్యలను ప్రస్తావించారు. ప్రతిపక్ష నేతల్లా ఏమిటంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నాడు అసహనం వ్యక్తంచేశారు. దీంతో అప్పట్నుంచి దాదాపుగా సమస్యలను ప్రస్తావించడం మానేశారు. చాలావరకు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. ఈ సమావేశానికి మంత్రులెవరూ హాజరు కాలేదు. ఇక, ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీల పదవీకాలానికి ఇదే చివరి జడ్పీ సమావేశం. దీంతో చాలామంది ధైర్యంగా సమస్యలు ప్రస్తావించారు. ఎప్పటిలాగే జడ్పీ సమావేశానికి మీడియాను అనుమతించలేదు. ఆయా వర్గాల నుంచి సేకరించిన సమాచారం మేరకు.. చేసిన పనులకు నిధులు విడుదల కాలేదని చంద్రగిరి జడ్పీటీసీ ప్రస్తావించారు. జగనన్న లేఅవుట్లకు సంబంధించి కొన్ని చోట్ల లబ్ధిదారులకు పట్టాలిచ్చినా ఇప్పటి వరకు స్థలాలు చూపలేదని, మరికొన్ని చోట్ల స్థలాలు చూపించినా పట్టాలు ఇవ్వలేదన్నారు. ఇలాగైతే ప్రభుత్వంపై లబ్ధిదారులు ఏవిధంగా విశ్వాసం ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఆర్ఎంపీలు నాసిరకం వైద్యం అందిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. పాలసముద్రం జడ్పీటీసీ మాట్లాడుతూ తమ మండలంలో 11 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు నోచుకోలేదన్నారు. పలుసార్లు అధికారులకు చెప్పినా స్పందించలేదన్నారు. సత్యవేడు సీహెచ్‌సీలో అనస్థీషియాను నియమించాలని, అష్టమాలజీకి సంబంధించిన పరికరాలను అందించాలన్నారు. రామచంద్రాపురం మండలంలో 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేయాల్సివున్నా ఇప్పటికీ జాప్యం జరుగుతోందని అక్కడి సభ్యుడు పేర్కొన్నారు. బంగారుపాళ్యం మండలం తుంబకుప్పంలో గృహనిర్మాణాలు ఇళ్లపట్టాలు మంజూరుచేయాలని సభలో ప్రస్తావించారు. జలజీవన్ మిషన్ కింద తాగునీటి కనెక్షన్ ఇస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో పైప్‌లైన్లు వేసుకున్నామని, ఏడాదైనా ఎలాంటి చర్యలు చేపట్టలేదని బి.కొత్తకోట జడ్పీటీసీ ఆరోపించారు. గట్టు ప్రాంతంలో ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని కోరారు. తొలుత జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని జడ్పీ నిధులను పారదర్శకంగా కేటాయిస్తున్నామన్నారు. హంద్రీ నీవా జలాల విడుదలకు సంబంధించి సీఎం జగన్ త్వరలో కుప్పం నియోజకవర్గానికి వస్తున్నట్లు తెలిపారు. జేసీ శ్రీనివాసులు, జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు.

మొక్కుబడి సమావేశం : మంగళవారం నాటి సమావేశం మొక్కుబడిగా మారింది. పలుశాఖలపై చర్చ జరగలేదు. వ్యవసాయం, విద్య, వైద్య, ఆరోగ్య, జలవనరులు, గృహనిర్మాణం, విద్యుత్తు, పంచాయతీరాజ్, డీఆర్డీఏ, డ్వామా, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, సాంఘిక సంక్షేమశాఖ ప్రగతిపై తూతూమంత్రంగా చర్చించారు. దీంతో ఉమ్మడి జిల్లాల నుంచి హాజరైన ఆయా శాఖల అధికారుల్లో కొందరు సెల్‌ఫోన్లకు పరిమితం కాగా, మరికొందరు చల్లగా నిద్రలోకి జారుకున్నారు. జడ్పీ సమావేశం ముగిసే వరకు వైసీపీ కండువాలు ధరించిన కార్యకర్తలు లోపల ఉన్నారు. జడ్పీటీసీ, ఎంపీపీల బంధువులు, వాహన డ్రైవర్లు సమావేశ హాలులో కూర్చొన్నారు. మీడియా ప్రతినిధులను మాత్రం అనుమతించలేదు.

జడ్పీ మిగులు బడ్జెట్ రూ.692.90 కోట్లు

జిల్లా పరిషత్తు (అనుబంధశాఖల) 2024-25 వార్షిక బడ్జెట్‌ను సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. చిత్తూరులోని జడ్పీ మీటింగ్ హాలులో ఛైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ సమావేశం జరిగింది. రూ.692.90 కోట్ల మిగులుతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మొత్తం రాబడులుగా రూ.4,133.08 కోట్లు, ప్రారంభ నిల్వ రూ.599.25 కోట్లు కలిపి రూ.4,733.34 కోట్లు వార్షిక రాబడిని బడ్జెట్‌లో పేర్కొన్నారు. కేటాయింపులు: డీఆర్డీఏ పద్దు కింద రూ.1973.44 కోట్లు, డ్వామాకు రూ.961.17 కోట్లు, పాఠశాల విద్యకు రూ.293.89 కోట్లు, వ్యవసాయ అనుబంధ శాఖలకు రూ.259.83 కోట్లు, పీఐయూ పనులకు రూ.181.33 కోట్లు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌కు రూ.150.87 కోట్లు వ్యయంగా చూపారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ కింద పనులు చేపట్టేందుకు రూ.123.15 కోట్లు కేటాయించారు.

మరో రెండు బడ్జెట్లకూ ఆమోదం

● ఇంకా రూ.15.23 కోట్ల జిల్లా పరిషత్ మిగులు బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. రాబడుల కింద రూ.82.87 కోట్లు, వ్యయం కింద రూ.67.63 కోట్లు చూపారు. గ్రామ పంచాయతీల్లో టైడ్ గ్రాంట్ రూపేణా వచ్చే నిధులతో పారిశుధ్యం, తాగునీటి పనులను రూ.15.16 కోట్లతో చేపడతామని పేర్కొన్నారు. అతిథిగృహాల నిర్వహణ, నిర్మాణాలకు రూ.4 కోట్లు, కొత్త జడ్పీ ఆఫీసు భవనానికి రూ.4 కోట్లు, కనీస అవసరాలు రూ.8.30కోట్లు మేర ఆర్థిక సంఘం నిధులు వ్యయ పద్ధతిలో పొందుపరిచారు. ప్రకృతి వ్యవసాయానికి రూ.కోటి కేటాయించారు.

● ఇక, 65 మండలాల ప్రజాపరిషత్తు పరిధిలో వివిధ శాఖల ఏకీకృత బడ్జెట్‌ను జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి ప్రవేశపెట్టారు. ఇందులో ఆదాయంగా రూ.4,147.22 కోట్లు, వ్యయంగా రూ.3,222.55 కోట్లు, మిగులుగా రూ.924.67 కోట్లు చూపారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులుతో పాటు వైస్ ఛైర్మన్లు ధనుంజయ రెడ్డి, రమ్య, ఉమ్మడి జిల్లా జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి

అంగన్వాడీల విజయోత్సవాలు



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న అంగన్వాడీలు

తిరుపతి (రవాణా), జనవరి 23 : తమ సమస్యలపై ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో 42 రోజులుగా చేసిన సమ్మెకు సోమవారం అర్ధరాత్రి వీడ్కోలు పలికిన అంగన్వాడీలు మంగళవారం విజయోత్సవాలు జరుపుకున్నారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో కేక్ కట్ చేసి, రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు. బుధవారం నుంచి విధుల్లోకి వెళుతున్నట్లు ప్రకటించారు. తమకు అండగా ఉన్న సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటం చేసి తమ సమస్యలు పరిష్కరించుకున్న ఘనత అంగన్వాడీలకు దక్కిందన్నారు. ప్రభుత్వం ఎన్ని కుతంత్రాలు, కుయుక్తులు పన్నినా లొంగకుండా పోరాడిన తీరు అభినందనీయమని కొనియాడారు. అంగన్వాడీలకు అన్ని విధాలుగా మద్దతుగా నిలిచిన ఆటో, హమాలీ, బిల్డింగ్, హాకర్స్, ఆర్టీసీ, ప్రజాసంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, టి.సుబ్రహ్మణ్యం, అంగన్వాడీ గౌరవాధ్యక్షుడు కేఎస్ఎన్ ప్రసాదరావు, బుజ్జి, తంజావూరు మురళి, వాసు, సాయిలక్ష్మి, జయంతి, హేమలత, కుమార్, వీఎస్ కుమార్, అంగన్వాడీలు నాగరాజమ్మ, జయప్రభ, కల్పన, గీత, గోమతి, సుజిత, యువరాణి, రోజా, ఎల్లమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యానికి సంగీత పరిమళం అద్దిన రాళ్లపల్లి



రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మకు నివాళి అర్పిస్తున్న వక్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 23: సాహిత్యానికి సంగీత పరిమళం అద్దిన మహోన్నతులు రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ అని ఎస్వీయూ ఓఆర్ఐ విభాగ డైరెక్టర్ డాక్టర్ పీసీ వేంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఓఆర్ఐ విభాగంలో రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ 131వ జయంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా రాళ్లపల్లె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. వేంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలను స్వరపరిచిన సంగీత ఖని రాళ్లపల్లి అని కొనియాడారు. 1950-57 మధ్య కాలంలో ఓఆర్ఐ విభాగంలో ఆయన పని చేశారని, ఈ క్రమంలోనే అన్నమయ్య కీర్తనలకు రాగ, తాళ, శ్రుతి, స్వర నిర్దేశం చేశారని తెలిపారు. సారస్వతాలోకం వంటి గొప్ప విమర్శనా గ్రంథాన్ని రాశారని చెప్పారు. రేడియోకు ఆకాశవాణి అని నామకరణం చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కృషికి గుర్తింపుగా ఎస్వీయూ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, వెంకటేష్, విజయ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్, సిద్ధయ్య, సంతోష్, యోగి, నర్సిరెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



తిరుపతి (రవాణా), జనవరి 23: కరకంబాడి రోడ్డు వినాయకసాగర్ వద్ద మంగళవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో బోస్ త్యాగాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జగన్నాథం, బెల్లంకొండ సురేష్, బాసికర్ల రఘు, బాలాజీనాయుడు, యోగా వెంకటేష్, కమలమ్మ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మోర్చా జిల్లా కమిటీ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 23: గిరిజన మోర్చా తిరుపతి జిల్లా కమిటీని నియమించినట్లు జిల్లా ఇన్‌చార్జి పెనుబోలా చంద్రశేఖర్ తెలిపారు. ప్రధాన కార్యదర్శులుగా రాజునాయక్, జనార్దన్,కోశాధికారిగా చిరంజీవిని, మరో23మంది కమిటీ సభ్యులను నియమించినట్లు ఆయన మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వివరించారు.

28న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 23 : అఖిల భారత బ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదికను ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు శ్రీవెంకట గాయత్రి సేవా ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు శేషగిరిరావు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతిఅర్బన్ బ్రాహ్మణ సేవ, ఎఫ్ఓటీ ఎంబీఎస్ సంయుక్తంగా హరేరామ హరేకృష్ణ మందిరం ఎదురుగా ఉన్న కంచి పాదక మండపంలో ఈ వేదిక నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 15 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.58 కోట్లు

తిరుమల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.58 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 67,568 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,054 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



జస్టిస్ వైద్యనాథన్ - సుప్రియ - కోటేశ్వరరావు

తిరుమల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్, రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు, అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, సినీనటులు సుప్రియ, కోటేశ్వరరావు ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే ఫాల్గుణ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుకున్నట్టు తెలిపారు.

తిరుమలలో క్రికెటర్ శ్రీకాంత్



తిరుమల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని రచన విశ్రాంతి గృహానికి చేరుకున్న ఆయనకు పలువురు క్రికెట్ అభిమానులు స్వాగతం పలికారు. బుధవారం ఆయన స్వామిని దర్శించుకోనున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించండి

తిరుపతి(కొర్లగుంట), జనవరి 23: సెంట్రల్ బస్టేషన్‌లో హమాలీలు పూర్తి స్థాయి విధులు నిర్వహిస్తూ ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని ఆర్టీసీ కడప జోన్ ఇన్‌చార్జ్ ఈడీ చెంగల్‌రెడ్డి ఆదేశించారు. కార్గో నిర్వాహకుల పట్ల హమాలీలు వ్యవహరిస్తున్న తీరుపై ఫిర్యాదులు వస్తుండడంతో ఆయన మంగళవారం వారితో సమావేశమయ్యారు. అయనమాట్లాడుతూ హమాలీలు కార్గో కౌంటర్‌లో బుకింగ్ లగేజీలను తీసుకోవడం, అరలలో భద్రపరచడం, బస్సుల్లో ఎక్కించడం, కస్టమర్లకుఅందివ్వడం తప్పనిసరిగాచేయాలన్నారు. అనంతరం 2024 సంవత్సరానికి హమాలీల లైసెన్సు రెన్యూవల్‌కు ఉత్తర్వులు జారీచేశారు. డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ పీవో డి.రామచంద్రనాయుడు, కమర్షియల్ ఏటీఎం సురేంద్రబాబు, కార్గో గుత్తేదారు సింగ్ సొల్యూషన్ ప్రతినిధి హర్ష పాల్గొన్నారు.

ఇద్దరు గజదొంగల అరెస్ట్

రూ.46.93 లక్షల బంగారు, వెండి, వస్తువుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగలను పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

తిరుపతి(నేరవిభాగం), జనవరి 23 : ఒంటరిగా ఉంటున్న, వయసు పైబడిన మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగులకు, తాళాలు వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతూ లక్షల రూపాయల విలువజేసే బంగారు, వెండి నగలు, వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరు గజ దొంగలను తిరుచానూరు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.46.93 లక్షల విలువజేసే బంగారు, వెండి, వాహనాలు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ పరమేశ్వరరెడ్డి మీడియాతో వివరాలు వెల్లడించారు. తిరుపతి మధురానగర్‌కు చెందిన పాపాని క్రాంతికుమార్ అలియాస్ క్రాంతి (26), కేటీ రోడ్డుకు చెందిన యమలం జ్ఞానేశ్‌కుమార్ అలియాస్ చంటి (25) చిన్ననాటి నుంచే చెడు అలవాట్లకులోనై డబ్బుకోసం దొంగతనాలు చేయడం ప్రారంభించారు. మూడు సంవత్సరాలుగా తిరుపతి, పరిసర ప్రాంతాల్లో అనేక దొంగతనాలు చేశారు. పిల్లలకు ట్యూషన్ చెబుతామని, బజాజ్ ఫైనాన్స్ నుంచి అడ్రస్ వెరిఫికేషన్‌కు వచ్చామని రకరకాల కారణాలు చెప్తూ ఇళ్లలోకి ప్రవేశించి అదను చూసి చైన్ స్నాచింగులు, చోరీలు చేయసాగారు. ఫిర్యాదులు రావడంతో క్రైం ఏఎస్పీ విమలకుమారి నేతృత్వంలో చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో తిరుచానూరు సీఐ శివప్రసాద్‌రెడ్డితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం ఈ ఇద్దరు నిందితులుగా గుర్తించి, కదలికలపై నిఘాపెట్టింది. తిరుపతి-రేణిగుంట మార్గంలోని వార్త క్రాస్ వద్ద ఉండగా అదుపులోకి తీసుకుంది. వారిని విచారించి 803 గ్రాముల బంగారు, 900 గ్రాముల వెండి ఆభరణాలు, ఓ రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్, 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.46,93,500 ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. నిందితులిద్దరూ విశాఖపట్నంలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి చెన్నైలో అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్టు తమ విచారణలో తేలిందని వెల్లడించారు. నిందితులిద్దరిపై జిల్లా వ్యాప్తంగా 14 కేసులు ఉన్నాయని చెప్పారు. దొంగలను పట్టుకోవడమేగాక పెద్ద మొత్తంలో నగలు, సొమ్మును రికవరీ చేసిన సీఐ శివప్రసాద్‌రెడ్డి, ఎస్ జగన్నాథరెడ్డి, ఏఎస్ఐ రాఘవయ్య, కానిస్టేబుళ్లు జాకీర్ హుస్సేన్, ప్రభాకర్, ప్రసాద్, లక్ష్మీప్రసాద్, మణిరత్నం, నాగార్జున, టెక్నికల్ విభాగం చందులను అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు.

రాజ్యాంగంపై

రేపు ఎస్వీయూలో సదస్సు

పౌర హక్కుల నేత హరగోపాల్ రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 23 : భారత రాజ్యాంగం - నైతికత అంశంపై ఎస్వీయూనివర్సిటీలో ఈనెల 25వ తేదీన సదస్సు జరగనుంది. ఉదయం 10 గంటలకు సెనేట్ హాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. పౌర చైతన్య వేదిక ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో పౌర హక్కుల నేత, హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ జి.హరగోపాల్ ప్రధాన వక్తగా పాల్గొంటారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు. సీనియర్ జర్నలిస్టు రామవశర్మ అధ్యక్షత వహిస్తారు. ఈ మేరకు పౌర చైతన్య వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాకా ప్రసాద్, కుమార్‌రెడ్డి తెలిపారు.

యువత భవిత కోసం

లోకేశ్ నాయకత్వం అవసరం

ఘనంగా యువనేత జన్మదిన వేడుకలు





రవినాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ శ్రేణులు - కంకణాల రజనీకాంత్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం

తిరుపతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు మంగళవారం నగరంలో ఘనంగా జరిగాయి. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు ఆధ్వర్యంలో పార్టీ నేతలు అలిపిరి పాదాల మండపం వద్ద 141 టెంకాయలు కొట్టి ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద యువగళం పాదయాత్రలో జరిగిన ముఖ్యమైన సంఘటనలతో కూడిన చిత్రాలతో భారీ కేక్ కట్‌చేసి, టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. రుయా ఆస్పత్రి ఎదుట తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ, పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడుతూ యువ ఆలోచనలు కలిగిన లోకేశ్ నాయకత్వం రాష్ట్రానికి అవసరమన్నారు. ఐటీ మంత్రిగా ఉన్నప్పుడు అనేక పరిశ్రమలు తీసుకురావడంలో చొరవ చూపారని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. రవినాయుడు మాట్లాడుతూ యువగళం పాదయాత్రతో యువత మొత్తం ఆయన వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రజనీకాంత్ మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు దంపూరి భాస్కర్, శ్రీధర్ వర్మ, శ్రీహరి నాయుడు, చినబాబు, ఊట్ల సురేంద్ర నాయుడు, పుష్పావతి, మన్నెం శ్రీనివాసులు, మునిశేఖర్ రాయల్, బ్యాంకు శాంతమ్మ, రామ్మూర్తి రాయల్, వేణుగోపాల్ నాయుడు, రత్నం, కుమారమ్మ, ఆముదాల తులసీరాం, కరాటే చంద్ర, మనోహరాచారి, హేమ, ఆర్సీ శ్రీనివాసులు, కృష్ణ యాదవ్, మధుబాబు, తోట వాసు, కరణం సందీప్, శ్రీనివాస్ యాదవ్, గాలి పవన్, రఫీ, పత్తిపాటి వివేక్, వెంకటేష్ యాదవ్, లోకేశ్ రాయల్, దిలీప్ రాయల్, శ్రీరామ్ బాబి తదితరులు పాల్గొన్నారు.

● కోడూరు యువసేన ఆధ్వర్యంలో..

టీడీపీనేత డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. రాజరాజేశ్వరి మఠంలో ఆయనపేరిట మృత్యుంజయ హోమం నిర్వహించారు. కోడూరు బాలన్న యువసేన ఆధ్వర్యంలో పెరుమాళ్ మధు, విజయలక్ష్మి, వివేక్ రుయాలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు.



ఆనందగౌడ్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు

లోకేశ్ రాజకీయ భవిష్యత్తు బాగుండాలి : తెలుగు యువత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 23 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రాజకీయ భవిష్యత్తు బాగుండాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్ ఆకాంక్షించారు. ఎస్వీ యూనివర్సిటీలో లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచి పెట్టారు. ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ లోకేశ్ తాత, తండ్రి నుంచి రాజకీయ వారసత్వాన్ని స్వీకరించి, ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. గతంలో మంత్రిగా యువతకు మంచి ఉపాధి అవకాశాలు కల్పించారని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారని తెలిపారు. యువత భవిష్యత్తు కోసం ప్రత్యేక మేనిఫెస్టో రూపకల్పనకు ప్రయత్నిస్తున్నారని, ఆయన రాజకీయంగా రాణిస్తే రాష్ట్ర భవిష్యత్తుకు చాలా మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నేత ఆర్కే నాయుడు, శరత్‌చౌదరి, నాగేంద్ర, బాలయ్య, హరి, బిసన్న, రవి, రంగన్న, రామాంజి, సోమేశు, మల్లికార్జున పాల్గొన్నారు.

ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు



తిరుపతి (రవాణా), జనవరి 23 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను కరకంబాడి రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద టీడీపీ తిరుపతి పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నారా లోకేశ్ ప్రజానాయకుడని, ఆయనకు రాజకీయంగా ఉన్నత భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీరభాస్కర్, ధనంజయ, సునీల్, కుమార్‌నాయుడు, గీతారాణి, లలిత, చిన్నబ్బ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీజేఎన్ఎం స్కూల్‌ను సందర్శించిన ప్రవీణ్ ప్రకాశ్



ఎస్పీజేఎన్ఎం స్కూల్‌ను పరిశీలిస్తున్న ప్రవీణ్‌ప్రకాశ్, పక్కనే కమిషనర్ హరిత

తిరుపతి(విద్య) జనవరి 23 : నగరంలోని శ్రీపండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌ను పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్ మంగళవారం సందర్శించారు. తాజ్‌హోటల్‌లో జరిగే రెండ్రోజుల ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌కి వచ్చిన ఆయన నగరపాలక కమిషనర్ హరితతో కలసి నాడు-నేడులో భాగంగా స్కూల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. తరగతి గదులు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ), డిజిటల్ బోర్డులు, మరుగుదొడ్లు, ఆర్వో సిస్టమ్‌ల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి, డీఈవో డాక్టర్ వి.శేఖర్, ఎంఈవో బాలాజి, హెచ్ఎం మునిశేఖర్, నగరపాలక సంస్థ ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్‌రెడ్డి, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు. కాగా తిరుపతిలో ఇండియా టుడే పేరిట జరిగే జాతీయస్థాయి విద్యాసమ్మేళనానికి హాజరైన ప్రతినిధులు బుధవారం ఉదయం 11 గంటలకు ఆ స్కూల్‌ను సందర్శించనున్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు.

రమాదేవి ఆస్పత్రిలో అపోలో వైద్య సేవలు ప్రారంభం



డాక్టర్ శశిధర్ రెడ్డి

తిరుపతి సిటీ, జనవరి 23 : రమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అపోలో వైద్యులతో గుండె, వాస్కులర్ సర్జరీలను బుధవారం నుంచి అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ డీ.బీ.శశిధర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై అపోలో ఆస్పత్రితో ఇప్పటికే కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఈ సేవలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. మహా నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉన్నటువంటి అరుదైన శస్త్ర చికిత్సలను ఇక్కడే అందిస్తున్నామని, అవసరమైన వారు ముందస్తుగా 7306633009కు ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ తీసుకోవాలని కోరారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎస్వీ వైద్య కళాశాల ముందు నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య ఉద్యోగులు

తిరుపతి సిటీ, జనవరి 23 : ప్రభుత్వం వైద్య ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఏపీ వైద్య ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు డిమాండ్ చేశారు. వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ ఆయన యూనియన్ నేతలు, ఉద్యోగులతో కలిసి ఎస్వీ వైద్య కళాశాల ముందు మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. వైద్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, సరెండర్ జీతాల బిల్లులు, జీపీఎఫ్, ఉద్యోగుల ఇన్‌సెంటివ్స్ వంటి సమస్యల పరిష్కారంతో పాటు ఉద్యోగుల క్రమబద్ధీకరణ వంటి వాటిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మన ఖగోళ విజ్ఞానం గొప్పది

తిరుపతి (కల్చరల్), జనవరి 23: భారతీయుల ఖగోళ విజ్ఞానం ఎంతో ఉన్నతమైందని సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు ఏ శ్రీపాద భట్ అన్నారు. మంగళవారం సాయంత్రం తిరుపతి పుస్తక ప్రదర్శనలోని వరాహమిహిర వేదిక నుంచి ఆయన మాట్లాడుతూ వరాహమిహిరుని బృహత్ సంహిత ఆనాడే భూమి రూపం, భూమిలోని ఖనిజాలు, నీటి వనరులు, భూకంపాలు, వర్షపాతం వంటి వివరాలను పేర్కొనిందన్నారు. జ్యోతిష్య, వాస్తు, ఆయుర్వేద గ్రంథాలు ఎంతో విలువైన విజ్ఞానాన్ని కలిగి ఉన్నాయన్నారు. గ్రహగతులను లెక్కించడం, వర్షపాతాన్ని అంచనా వేయడం, రుతువులు, నక్షత్రాల ఆధారంగా నెలలకు పేర్లు పెట్టడం వంటివి ఆనాటి ఋషుల పరిజ్ఞానాన్ని సూచిస్తాయన్నారు. గౌరవ అతిథి, విశ్రాంత బ్యాంకు అధికారి ఎస్.బద్రీనారాయణ మాట్లాడుతూ భారతీయ జీవన విధానంలో 16 సంఖ్యకు ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు. నేటి చంద్రయానం, మార్స్ ప్రయాణాలకు మన పూర్వుల లెక్కలే ఆధారమని తెలిపారు. ఈ సభకు భారతీయ విద్యా భవన్ సంచాలకులు డాక్టర్ సత్యనారాయణరాజు అధ్యక్షత వహించారు. సాయంత్రం 5నుంచి 6.30 వరకు భారతీయ విద్యాభవన్ శ్రీవేంకటేశ్వర విద్యాలయ విద్యార్థుల సంగీత విభావరి ఆహూతులను అలరించింది. మధ్యాహ్నం 3 గంటలకు 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పుస్తకాలు, రచయితలు, కరెంట్ అఫైర్స్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు.



బాలల నేస్తం ఈ-సంచిక ఆవిష్కరణ

బాలల నేస్తం ఆవిష్కరణ

పుస్తక ప్రదర్శనలో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీమురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, గోవిందయ్య సంపాదకులుగా ఇటీవల వెలువరించిన బాలల నేస్తం ఈ-మాసపత్రిక జనవరి సంచికను భారతీయ విద్యా భవన్ సంచాలకులు డాక్టర్ సత్యనారాయణ రాజు ఆవిష్కరించారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజ. కథా రచయిత కృష్ణస్వామి రాజు, తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

తిరుపతి పుస్తక ప్రదర్శనలో ఐదవ రోజు బుధవారం మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల మధ్య కాలేజి విద్యార్థులకు రాతపూర్వక క్విజ్ పోటీలు ఉంటాయి. అనంతరం సంగీత విభావరి ఉంటుంది. ధన్వంతరి వేదికపై ముఖ్య అతిథిగా శ్రీవేంకటేశ్వర ఆయుర్వేద కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.మురళీకృష్ణ, గౌరవ అతిథిగా శ్రీవేంకటేశ్వర ఆయుర్వేద కళాశాల, కాయచికిత్స విభాగాధిపతి డాక్టర్ ఎస్.జ్ఞానప్రసూన పాల్గొంటారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

టీడీపీలోనే బీసీలకు సముచితస్థానం: పాశిం


కార్యక్రమంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

చిల్లకూరు, జనవరి 23: బీసీలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని తిక్కవరంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎన్టీఆర్ 20శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, చంద్రబాబునాయుడు 34 శాతానికి పెంచారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బీసీ నాయకులపై దౌర్జన్యాలకు పాల్పడుతూ వారి అరెస్ట్ చేసి ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా 79 మంది నాయకులను హత్య చేయించిందన్నారు. బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి బలహీల వర్గాల అభ్యున్నతికి తిలోదకాలిచ్చిందని దుయ్యబట్టారు. బీసీలకు అండగా నిలిచేందుకు చంద్రబాబునాయుడు మినీ మేనిఫెస్టోలో బీసీ రక్షణ చట్టాన్ని రూపొందించారన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలందరూ టీడీపీకి అండగా నిలిచి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, చెంచురామయ్య, లీలావతి, వెంకటేశ్వర్లురెడ్డి, నెల్లటూరు చిరంజీవి, అన్నం మునిశేఖర్‌గౌడ్, మేకల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

వాకాడు, జనవరి 23: స్వర్ణముఖినది నుంచి దుగరాజపట్నం పొలాలకు సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని రైతులు మంగళవారం తహసీల్దారు నరసింహరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుగరాజపట్నం కాలువ గుండా సాగునీటిని విడుదల చేస్తామని ప్రజాప్రతినిధులు, సాగునీటి అధికారులు చెప్పడంతో సుమారు 2,200 ఎకరాల్లో వరిసాగు చేపట్టామన్నారు. అయితే పలువురు అడ్డుకున్నారనే నేపంతో కాలువకు నీళ్లివ్వడంలేని, దీంతో తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకుని మూడు రోజుల్లో నీటిని విడుదల చేయకపోతే ధర్నాకు దిగుతామని రైతులు చెప్పారు.

రహదారి నిబంధనలు పాటించండి


కరపత్రాలను అందజేస్తున్న ఎంవీఐ సునీల్

గూడూరు, జనవరి 23: వాహనాలను నడిపే సమయంలో రహదారి నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని ఎంవీఐ సునీల్ అన్నారు. మంగళవారం స్థానిక గమళ్లపాళెంలో రవాణాశాఖ అధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కరపత్రాలను అందజేశారు. అతివేగంగా వాహనాలను నడపవద్దని, నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాహుల్, కరీం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మా కుమార్తెను అల్లుడే చంపేశాడు!

యువతి తల్లిదండ్రుల ఆరోపణ ● మృతదేహానికి పోస్టుమార్టం చేయాలని ప్రభుత్వాస్పత్రి ఎదుట బంధువుల ధర్నా

వెంకటగిరి, జనవరి 23: తమ బిడ్డను అల్లుడే చంపేశాడని వెంకటగిరి పట్టణంలోని 14వార్డు పరిధిలోని ధర్మాపురానికి చెందిన చేమూరు సుశీలమ్మ, పెంచలయ్య దంపతులు ఆరోపించారు. తమ కుమార్తె మృతదేహానికి పోస్టుమార్టం చేయాలంటే మంగళవారం ప్రభుత్వాస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుమార్తె రోజాకు పట్టణ పరిధిలోని 8వ వార్డు పరిధిలోని మరాటపల్లి ప్రాంతానికి చెందిన పరమాల శ్రీనివాసులుతో ఆరేళ్ల క్రితం వివాహం చేశామన్నారు. సంతానం కలుగలేదని, తన కుమారుడికి రెండో పెళ్లి చేస్తానంటూ అల్లుడు శ్రీనివాసులు తల్లి తరచూ గొడవపడేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 16వ తేదీ మోటర్ బైక్‌పై వెళుతుండగా జరిగిన ప్రమాదంలో రోజా మృతి చెందినట్లు చెప్పి అంత్యక్రియలు నిర్వహించినట్లు పెంచలయ్య దంపతులు తెలిపారు. అయితే మృతి చెందిన తమ కుమార్తె మెడలో తాళిబొట్టులేక పోవడం, అల్లుడు శ్రీనివాసులుకు గాయాలు లేకపోవడం, బైక్‌కు ఎటువంటి దెబ్బలు తగలకపోవడంతో అనుమానించి ప్రశ్నించామని చెప్పారు. అల్లుడు శ్రీనివాసులు, అతని తమ్ముడు గిరీష్, తల్లి దుర్గమ్మ దురుసుగా సమాధానం చెప్పడంలో ఈ నెల 22వ తేదీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారని తెలిపారు. పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేయాలని తహసీల్దారు ఆదేశిస్తే స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యులు నిరాకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా విషయం తెలుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని బాధితులతో చర్చించారు. స్థానిక వైద్యులు మాట్లాడుతూ పూడ్చిన శవానికి తాము పోస్టుమార్టం చేస్తే ఆధారాలు లభించవని చెప్పారు. ఫోరెన్సిక్ నిపుణులతో శవపరీక్ష చేయించాలని సూచించారు.


ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

సూళ్లూరుపేటలో టీడీపీ జెండా ఎగరవేస్తాం: నెలవల

పెళ్లకూరు, జనవరి 23: వచ్చే ఎన్నికల్లో సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరవేస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పెళ్లకూరు మండలంలోని కొత్తూరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి, అరాచకం, దోపిడీ, దౌర్జన్యకాండ పాలన సాగిస్తున్న వైసీపీని ప్రజలు భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్రతో పార్టీకి పూర్వవైభవం వచ్చిందన్నారు. వైసీపీ అడుగడుగునా ఎన్ని అడ్డంకులు సృష్టించిన యువగళం పాదయాత్రను దిగ్విజయంగా పూర్తిచేసి పార్టీ శ్రేణులకు తానున్నానంటూ నారా లోకేశ్ భరోసా కల్పించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, జనసేన కూటమి ప్రభంజనం సృష్టించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. రెండు దఫాలుగా సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ ఓటమి చెందినా వచ్చే ఎన్నికల్లో విజయం తథ్యమని స్పష్టం చేశారు. అందరం కలసికట్టుగా పనిచేసి నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరవేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు శేఖర్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు, సుధీర్‌రెడ్డి, సుధీర్, రామకృష్ణ, మునిరామయ్య, సిద్దులయ్య, కేవీ నాయుడు, హరినాయుడు, పోలయ్య, యుగంధర్, సుబ్రహ్మణ్యంరెడ్డి, వెంకటేశ్వర్లు, గురవయ్య, సుగుణమ్మ, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలు దాటబోయిన ప్రయాణికుడు రైలు ఢీకొని మృతి

తడ, జనవరి 23: సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలు దాటుతున్న ప్రయాణికుడుని రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. తడ రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ మొదటి ప్లాట్‌ఫామ్ నుంచిపట్టాలు దాటి రెండో ప్లాట్‌ఫాం వైపు వెళ్తుండగా కన్యాకుమారికి వెళ్లే సూపర్‌ఫాస్టు రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రయాణికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతని వద్ద ఉన్న లగేజీని పరిశీలించినా ఎటువంటి ఆధారాలు లభించకలేదు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

33757 డ్వాక్రా సంఘాలకు 298.67కోట్ల ఆసరా


స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణా రెడ్డి

వెంకటగిరి టౌన్, జనవరి 23: జిల్లాలోని 33,757స్వయం సహాయక సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.298.67కోట్లను జమ చేసినట్లు కలెక్టర్ వెంకటరమణా రెడ్డి తెలిపారు.వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో డ్వాక్రా సంఘాల మహిళలకు ఆసరా లబ్ధికి సంబంధించిన నమూనా చెక్కును అందజేశారు. అంతకు ముందు మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజరు సుభాష్,డీఆర్డీఏ పీడీ రాధమ్మ,మెప్మా పీడీ జ్యోతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీతోనే అవినీతి ప్రక్షాళన

గూడూరు, జనవరి 23: ఆమ్ ఆద్మీపార్టీతోనే రాష్ట్రంలో అవినీతి రాజకీయ ప్రక్షాళన మార్పు సాధ్యమవుతుందని ఆపార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మణి నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక జాతీయ రహదారి సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఆమ్ ఆద్మీపార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి పెచ్చుమీరిపోయిందన్నారు. ఢిల్లీలో సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థను దేశంలోనే ఉన్నత స్థానంలో నిలిపారన్నారు. ప్రజలంతా అభివృద్ధిని కాంక్షించే ఆమ్ ఆద్మీపార్టీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో రమేష్, కోడివాక చందు, రవి, శ్రావణ్‌కుమార్, సుధాకర్, అమరేంద్ర, కళ్యాణ్, అజయ్, మణి తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

గూడూరు, జనవరి 23: స్థానిక ఏరియా ఆస్పత్రిలో మంగళవారం నారా లోకేశ్ పుట్టిరోజు సందర్భంగా టీడీపీ కార్యకర్త చిరంజీవి కుమారుడు చిన్నారి అనిత్‌కుమార్ రోగులకు ఆహార పొట్లాలు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.

సమస్యలకు పరిష్కారమేదీ?

● జడ్పీ సమావేశంలో తొలిసారి గొంతెత్తిన జడ్పీటీసీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 23: మండలాల్లో సమస్యలు పరిష్కారం కావడంలేదని పలువురు జడ్పీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. కొన్ని మండలాల్లో తాగునీరు, జగనన్న లేఅవుట్, నాడు-నేడు పనులు జరగడం లేదని వాపోయారు. జడ్పీ సమావేశంలో తొలిసారిగా వీరు సమస్యలపై గొంతెత్తారు. కొత్త పాలకవర్గం ఏర్పాటయ్యాక జరిగిన సమావేశాల్లో ఓసారి ముగ్గురు ఎమ్మెల్యేలు సమస్యలను ప్రస్తావించారు. ప్రతిపక్ష నేతల్లా ఏమిటంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నాడు అసహనం వ్యక్తంచేశారు. దీంతో అప్పట్నుంచి దాదాపుగా సమస్యలను ప్రస్తావించడం మానేశారు. చాలావరకు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. ఈ సమావేశానికి మంత్రులెవరూ హాజరు కాలేదు. ఇక, ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీల పదవీకాలానికి ఇదే చివరి జడ్పీ సమావేశం. దీంతో చాలామంది ధైర్యంగా సమస్యలు ప్రస్తావించారు. ఎప్పటిలాగే జడ్పీ సమావేశానికి మీడియాను అనుమతించలేదు. ఆయా వర్గాల నుంచి సేకరించిన సమాచారం మేరకు.. చేసిన పనులకు నిధులు విడుదల కాలేదని చంద్రగిరి జడ్పీటీసీ ప్రస్తావించారు. జగనన్న లేఅవుట్లకు సంబంధించి కొన్ని చోట్ల లబ్ధిదారులకు పట్టాలిచ్చినా ఇప్పటివరకు స్థలాలు చూపలేదని, మరికొన్నిచోట్ల స్థలాలు చూపించినా పట్టాలు ఇవ్వలేదన్నారు. ఇలాగైతే ప్రభుత్వంపై లబ్ధిదారులు ఏవిధంగా విశ్వాసం ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఆర్ఎంపీలు నాసిరకం వైద్యం అందిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. పాలసముద్రం జడ్పీటీసీ మాట్లాడుతూ తమ మండలంలో 11 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు నోచుకోలేదన్నారు. పలుసార్లు అధికారులకు చెప్పినా స్పందించలేదన్నారు. సత్యవేడు సీహెచ్‌సీలో అనస్థీషియాను నియమించాలని, ఆప్తమాలజీకి సంబంధించిన పరికరాలను అందించాలన్నారు. రామచంద్రాపురం మండలంలో 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేయాల్సివున్నా ఇప్పటికీ జాప్యం జరుగుతోందని అక్కడి సభ్యుడు పేర్కొన్నారు. బంగారుపాళ్యం మండలం తుంబకుప్పంలో గృహనిర్మాణాలు ఇళ్లపట్టాలు మంజూరుచేయాలని సభలో ప్రస్తావించారు. జలజీవన్ మిషన్ కింద తాగునీటి కనెక్షన్ ఇస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో పైప్‌లైన్లు వేసుకున్నామని, ఏడాదైనా ఎలాంటి చర్యలు చేపట్టలేదని బి.కొత్తకోట జడ్పీటీసీ ఆరోపించారు. గట్టు ప్రాంతంలో ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని కోరారు. తొలుత జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని జడ్పీ నిధులను పారదర్శకంగా కేటాయిస్తున్నామన్నారు. హంద్రీ నీవా జలాల విడుదలకు సంబంధించి సీఎం జగన్ త్వరలో కుప్పం నియోజకవర్గానికి వస్తున్నట్లు తెలిపారు. జేసీ శ్రీనివాసులు, జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు.

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీల డుమ్మా

వచ్చే నెలలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరో 60 రోజుల్లో జిల్లాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగే అవకాశం లేదు. దీంతో ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఇదే చివరి సమావేశం. ఈ సమావేశానికి చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప మినహా , మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు ఎమ్మెల్సీలూ హాజరు కాలేదు.ఎంపీగా ఐదేళ్ల పదవీకాలం ముగుస్తున్న తరుణంలో రెడ్డెప్పను పలువురు సన్మానించారు.

మొక్కుబడి సమావేశం

మంగళవారం నాటి సమావేశం మొక్కుబడిగా మారింది. పలుశాఖలపై చర్చ జరగలేదు. వ్యవసాయం, విద్య, వైద్య, ఆరోగ్య, జలవనరులు, గృహనిర్మాణం, విద్యుత్తు, పంచాయతీరాజ్, డీఆర్డీఏ, డ్వామా, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, సాంఘిక సంక్షేమశాఖ ప్రగతిపై తూతూమంత్రంగా చర్చించారు. దీంతో ఉమ్మడి జిల్లాల నుంచి హాజరైన ఆయా శాఖల అధికారుల్లో కొందరు సెల్‌ఫోన్లకు పరిమితం కాగా, మరికొందరు చల్లగా నిద్రలోకి జారుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

మీటింగులో వైసీపీ కార్యకర్తలు

జడ్పీ సమావేశం ముగిసే వరకు వైసీపీ కండువాలు ధరించిన కార్యకర్తలు లోపల ఉన్నారు. జడ్పీటీసీ, ఎంపీపీల బంధువులు, వాహన డ్రైవర్లు సమావేశ హాలులో కూర్చొన్నారు. మీడియా ప్రతినిధులను మాత్రం అనుమతించలేదు.

జడ్పీ మిగులు బడ్జెట్ రూ.692.90 కోట్లు

● రాబడులు రూ.4,732.34 కోట్లు
● వ్యయం రూ.4,039.44 కోట్లు
● సర్వసభ్య సమావేశంలో ఆమోదం

జిల్లా పరిషత్తు (అనుబంధశాఖల) 2024-25 వార్షిక బడ్జెట్‌ను సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. చిత్తూరులోని జడ్పీ మీటింగ్ హాలులో ఛైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ సమావేశం జరిగింది. రూ.692.90 కోట్ల మిగులుతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మొత్తం రాబడులుగా రూ.4,133.08 కోట్లు, ప్రారంభనిల్వ రూ.599.25 కోట్లు కలిపి రూ.4,733.34 కోట్లు వార్షిక రాబడిని బడ్జెట్‌లో పేర్కొన్నారు.

కేటాయింపులు: డీఆర్డీఏ పద్దు కింద రూ.1973.44 కోట్లు, డ్వామాకు రూ.961.17 కోట్లు, పాఠశాల విద్యకు రూ.293.89 కోట్లు, వ్యవసాయ అనుబంధ శాఖలకు రూ.259.83 కోట్లు, పీఐయూ పనులకు రూ.181.33 కోట్లు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌కు రూ.150.87 కోట్లు వ్యయంగా చూపారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ కింద పనులు చేపట్టేందుకు రూ.123.15 కోట్లు కేటాయించారు.

మరో రెండు బడ్జెట్లకూ ఆమోదం

● ఇంకా రూ.15.23 కోట్ల జిల్లా పరిషత్ మిగులు బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. రాబడుల కింద రూ.82.87 కోట్లు, వ్యయం కింద రూ.67.63 కోట్లు చూపారు. గ్రామ పంచాయతీల్లో టైడ్ గ్రాంట్ రూపేణా వచ్చే నిధులతో పారిశుధ్యం, తాగునీటి పనులను రూ.15.16 కోట్లతో చేపడతామని పేర్కొన్నారు. అతిథిగృహాల నిర్వహణ, నిర్మాణాలకు రూ.4 కోట్లు, కొత్త జడ్పీ ఆఫీసు భవనానికి రూ.4 కోట్లు, కనీస అవసరాలు రూ.8.30కోట్లు మేర ఆర్థిక సంఘం నిధులు వ్యయ పద్ధతిలో పొందుపరిచారు. ప్రకృతి వ్యవసాయానికి రూ.కోటి కేటాయించారు.

● ఇక, 65 మండలాల ప్రజాపరిషత్తు పరిధిలో వివిధశాఖల ఏకీకృత బడ్జెట్‌ను జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి ప్రవేశపెట్టారు. ఇందులో ఆదాయంగా రూ.4,147.22 కోట్లు, వ్యయంగా రూ.3,222.55 కోట్లు, మిగులుగా రూ.924.67 కోట్లు చూపారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులుతో పాటు వైస్ ఛైర్మన్లు ధనుంజయ రెడ్డి, రమ్య, ఉమ్మడి జిల్లా జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్‌పై విద్యార్థులకు అవగాహన


ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు సుబ్రహ్మణ్యం

వడమాలపేట, జనవరి 23: ఎన్నికల పోలింగ్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటు వేయడంపై అవగాహన కల్పించారు. జాబితా ప్రకారం ఏ స్టేషన్‌లో, ఏ విధంగా ఓటు వేయాలో వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, ఓటింగ్ విధానంపై తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు.

మహిళలు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి


క్యాన్సర్ శిబిరాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి రోజా

వడమాలపేట, జనవరి 23: ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మహిళలు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని మంత్రి రోజా కోరారు. మంగళవారం వడమాలపేటలో స్విమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో 150వ పింక్ క్యాన్సర్ మెబైల్ శిబిరాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. స్విమ్స్ వైద్య క్యాన్సర్ విభాగాధిపతి నాగరాజు ఆధ్వర్యంలో సుమారుగా 80 మంది మహిళలకు క్యాన్సర్ వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకం కాదని, ముందస్తుగా నిర్ధారణ చేయించుకుని తగు చికిత్స ద్వారా ఉపశమనం పొందాలని కోరారు. కార్యక్రమంలో స్విమ్స్ వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

శ్మశాన భూమిని సర్వే చేయండి

పుత్తూరు టౌన్, జనవరి 23: మండల పరిధిలోని తడుకు పంచాయతీ, రంగుంట యానాది కాలనీలో శ్మశాన స్థలాన్ని సర్వే చేసి చూపాలని దళిత సంఘ నాయకులు నందయ్య, తహసీల్దారు పరమేశ్వర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగుంట యానాదులు 70 ఏళ్లగా శ్మశానంగా వినియోగిస్తున్న స్థలాన్ని కొందరు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రంగుంట యానాదులు సుశీల, గిరి, బాలయ్య, కన్నెమ్మ, నాగరాజు, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా రుద్రాభిషేకం



వడమాలపేట, జనవరి 23: స్థానిక భవానీ శంకర దేవాలయంలో మహాశివుని జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా మంగళవారం మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం రుద్ర గమకాలు పటిస్తూ భక్తుల శివ నామ స్మరణల నడుమ మహాలింగానికి మహారుద్రాభిషేకం చేశారు. పురోహితులు శివ, సాయిలు ఆధ్వర్యంలో మహాశివుని లింగాన్ని పూలమాలలతో అలంకరించి మంగళ హారుతులిచ్చారు. భక్తులకు కల్లూరుకు చెందిన సుధాకర్ రెడ్డి, ప్రమీల దంపతులు అన్నదానం చేశారు.

ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు



పుత్తూరు, నారాయణవనంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, జనవరి 23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను పుత్తూరు పట్టణంలోని కల్యాణపురం వద్ద ఉన్న జీజేఎస్ కార్యాలయం వద్ద ఆ పార్టీ పట్టణ, రూరల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు గణేష్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ద్రౌపదీదేవి ఆలయ తోపులో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ కరుణాకరన్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు, కౌన్సిలర్లు కేశవాచ్చారి, రాధా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం: మండల కేంద్రంలో టీడీపీ మండలాధ్యక్షుడు గిరిబాబు ఆధ్వర్యంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు షణ్ముగం, విజయ్, వాసుదేవన్, లక్ష్మన్, లోకయ్య, శేఖర్, కుట్టియప్పన్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతో సమ్మె విజయవంతం

పుత్తూరు అర్బన్, జనవరి 23: డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు నలభైకి రోజులకు పైగా చేసిన నిరవధిక సమ్మెకు ఫలితంగానే ప్రభుత్వం దిగివచ్చిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ స్పష్టం చేశారు. మంగళవారం సమ్మె విజయవంతంపై పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎట్టకేలకు ప్రభుత్వం దిగివచ్చి 11 డిమాండ్ల పరిష్కారానికి సానుకూలంగా స్పందించడంతో పాటు జీవోలను సైతం విడుదల చేసేందుకు సుముఖత వ్యక్తం చేయడం అంగన్వాడీ కార్యకర్తలు సాధించిన విజయంగా అభివర్ణించారు. సీఐటీయూ పోరాట ఫలితంగానే ప్రభుత్వం దిగివచ్చిందని స్పష్టం చేశారు. అనంతరం టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి వెళ్లి సీడీపీవో కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టులను అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ గౌరవాధ్యక్షుడు డి.మహేష్ పాల్గొన్నారు.


సీడీపీవో కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టులు అందిస్తున్న అంగన్వాడీలు

ఆరోగ్యశ్రీ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి


సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ రమాదేవి

వడమాలపేట, జనవరి 23: ఆరోగ్యశ్రీ వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగామ్ అధికారి డాక్టర్ రమాదేవి కోరారు. స్థాని మండల పరిషత్ కార్యాలయంలో మంగళశారం ఆరోగ్యశ్రీ పథకంపై వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 10551 కుటుంబాలను ఆరోగ్యశ్రీ లబ్ధిదారులుగా గుర్తించినట్లు తెలిపారు. 5372 కుటుంబాలకు కార్డులు అందజేశామని, మిగిలిన వారు ఈకేవైసీ చేసుకోవాల్సి ఉందన్నారు. నిరుపేదలకు ఆరోగ్యశ్రీ వరం లాంటిదని, ఉచితంగా ప్రభుత్వ, ప్రవేటు ఆసుపత్రులు ఉచితంగా సేవలందించడానికి సిద్ధంగా ఉందన్నారు. సమీక్షలో వైద్యాధికారి చక్రపాణి, కమ్యూనిటీ హెల్త్ అధికారి పురుషోత్తం రెడ్డి, సూపర్‌వైజర్ చంద్రమోహన్, సీమెచ్‌ఎస్ మంజు, ఎంపీడీవో భానుమూర్తి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వ్యర్థాల నిలయంగా ఆస్పత్రి రోడ్డు



ఏరియా ఆస్పత్రి రోడ్డు మధ్యలో వేసిన కోళ్ల వ్యర్థాలు

శ్రీకాళహస్తి, జనవరి 23: శ్రీకాళహస్తి ఆస్పత్రి రోడ్డు వ్యర్థాలకు నిలయంగా మారింది. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు నుంచి చెంచులక్ష్మి కాలనీ వరకు వున్న ఈ రోడ్డులో ఏరియా ఆస్పత్రితో పాటు పలు ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు ఉన్నాయి.పలు నివాస కాలనీలు కూడా ఈ మార్గంలో ఉన్నాయి. స్థానిక ప్రజలతో పాటు నిత్యం విద్యార్థులు, రోగులు, వారి సంబంధీకులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. పట్టణంలో కీలకమైన ప్రాంతం కావడంతో జనసంచారం రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. పట్టణంలోని పలు చికెన్ దుకాణాల నిర్వాహకులు కుళ్లిపోయిన వ్యర్థాలను ఈ మార్గంలో వదిలి వెళుతున్నారు.టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇదే తరహా సమస్య తలెత్తినప్పుడు పురపాలక అధికారులు ప్రత్యేకంగా కార్మికులను కేటాయించి ఈ రోడ్డును శుభ్రంగా వుంచేవారు. భవన నిర్మాణ వ్యర్థాలు, కోళ్ల వ్యర్థాలు ప్రభుత్వ ఆస్పత్రి రోడ్లోకి చేరకుండా చర్యలు తీసుకున్నారు.ప్రభుత్వం మారడంతో ఆస్పత్రి రోడ్డు మళ్లీ అధ్వాన స్థితికి చేరింది. నాలుగేళ్ల నుంచి ప్రజలు అపారిశుధ్యంపై అధికారులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నా ఫలితం లేకుండా పోతోంది. గతంలో రోడ్డు పక్కన వదిలివేసే దుర్గంధ భరితమైన వ్యర్థాలను ప్రస్తుతం నిస్సిగ్గుగా నడిరోడ్డుపై వేస్తున్నారు. ఇదే తరహాలో మంగళవారం ఉదయం ఎవరో కోళ్ల వ్యర్థాలను నడిరోడ్డుపై వేశారు. సాధారణంగానే వ్యర్థాలు, మలమూత్ర విసర్జనలు, పందుల సంచారంతో జనం ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి. మంగళవారం నడిరోడ్డుపై భరించలేని దుర్గంధం వెదజల్లడంతో వామ్మో కంపు కంపు అనుకుంటూ జనం ఇబ్బందికరంగా రాకపోకలు సాగించారు. ఆంధ్రజ్యోతి ఫిర్యాదుతో శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు స్పందించి వ్యర్థాలను తీయించడంతో స్థానికులు ఊరట పొందారు.ఇకనైనా ఆస్పత్రి మార్గంలో పారిశుధ్యంపై అధికారులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

నారా లోకేశ్ ఆశయాలు మహోన్నతం

శ్రీకాళహస్తి/తొట్టంబేడు, జనవరి 23: టీడీపీ యువ నేత నారా లోకేశ్ ఆశయాలు మహోన్నతమని పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. లోకేశ్ జన్మదిన వేడుకలను మంగళవారం శ్రీకాళహస్తిలో ని ఎన్టీఆర్ భవన్‌లో కేక్ కట్ చేసి పెద్దఎత్తున జరుపుకున్నారు.200 మంది దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశారు.టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కూడలి వద్ద పేదలకు అన్నదానం చేశారు.కంఠా రమేష్, ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.సుధీర్‌రెడ్డి భార్య రిషితారెడ్డి ముక్కంటి ఆలయ బిక్షాల గాలిగోపురం వద్ద 501 కొబ్బరికాయలు కొట్టి లోకేశ్ నూరేళ్లు వర్ధిల్లాలని ప్రార్థించారు.తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష పెళ్లి మండపం వద్ద భారీ కేక్ కట్ చేశారు.సన్నిధి వీధిలోని స్వయంభు లింగం స్వామి ఆశ్రమంలో అన్నదానం చేశారు.వెలంపాడులో కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు అమరనాథ్, భక్తవత్సలనాయుడు, సీతారామయ్య, కిలారి మోహన్‌కృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.తొట్టంబేడు మండలం శివనాథపాళెం వద్ద అమ్మ ఆశ్రమంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. 12వ వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న వాసు అనే వ్యక్తికి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు.తెలుగు మహిళలు రేణుక, సుమతి,అనిత,రమాదేవి,సరోజమ్మ, అమ్ములు, తులసి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో దివ్యాంగులకు మూడు చక్రాల బండ్ల పంపిణీ

రేణిగుంటలో....

లోకేశ్ జన్మదిన వేడుకలను మంగళవారం రేణిగుంటలో ఘనంగా జరుపుకున్నారు.ఎన్టీఆర్ విగ్రహం వద్ద సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు పంపిణీ చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు పి. మునస్వామినాయుడు,చిన్నారెడ్డి, ఎస్. మహబూబ్‌బాషా, నాదమునిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, వెంకటమునిరెడ్డి, సీయన్ సుబ్రమణ్యం రెడ్డి, రవి, ముచ్చేలు భాస్కర్‌రెడ్డి, ఇ.మురళి, కరీముల్లా, మేరీ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో....

నారా లోకేశ్ జన్మదిన వేడుకలను బుచ్చినాయుడుకండ్రిగలో టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు.కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర నాయుడు, సుందరయ్య, కన్నయ్య నాయుడు,వెంకటాచలం,శ్రీనివాసులు, రమేష్‌బాబు, భాస్కర్ యాదవ్, ఉషారాణి, వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.





వరదయ్యపాళెంలో...

వరదయ్యపాళెం మండలంలో లోకేష్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జి నిర్మల్, నాయకులు నాగరాజుయాదవ్, మల్లినాయుడు, రమేష్, శివన్న, సురేష్‌రెడ్డి, అజయ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ దశరథ ఆధ్వర్యంలో కూడా లోకేశ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు.టీడీపీ నాయకులు జయచంద్ర నాయుడు , చలపతి నాయుడు, శ్రీనివాసులు నాయుడు, హరిప్రసాద్ నాయుడు, మహేష్, గోవిందయ్య, వెంకయ్య,దశరథయ్య తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురంలో...

లోకేష్ 41వ జన్మదిన వేడుకలను కేవీబీపురంలో ఘనంగా జరుపుకున్నారు. నారా లోకేష్ ఆయురారోగ్యలతో ఉండాలని సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.టీడీపీ నాయకులు రామాంజుల నాయుడు, గోపీనాథ రెడ్డి, సురేష్ రెడ్డి, సాధు, వెంకటేష్, చలపతి రాజు, బాలాజి తదితరులు పాల్గొన్నారు.



పిచ్చాటూరులో : లోకేశ్ జన్మదిన వేడుకలను పిచ్చాటూరులో ఘనంగా నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఉదయం పార్టీ కార్యాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహించగా మధ్యాహ్నం క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి తన బృందంతో జన్మదిన వేడుకలను నిర్వహించారు.

సత్యవేడులో : సత్యవేడులోని గడియారం సెంటర్ వద్ద మంగళవారం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు.మాజీ ఎంపీపీ మస్తాన్, నాయకులు పరమశివం, పరంధామయ్య నాయుడు, వెంకటేశ్వర్లు, కుబేరన్, సంతోష్‌కుమార్, శశిమోహన్, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.జేడీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.సుందరరామిరెడ్డి,గోవిందస్వామి, రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇదేంటి జగన్ మామా...?



పాఠశాల గోడకు నీళ్లు పడుతున్న విద్యార్థి

శ్రీకాళహస్తి, జనవరి 23: నాడు నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందని ఊదరగొట్టారు.. అరకొరగా పనులు చేస్తూ అవస్థలతో తరగతులను నిర్వహించాల్సిన దుస్థితి తెచ్చారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం మేనమామగా నిలుస్తానని చెప్పుకుంటున్న సీఎం జగన్ పాలనలో విద్యార్థులు పలుచోట్ల కూలీలుగా మార్చేస్తున్నారు. శ్రీకాళహస్తి పట్టణం పానగల్‌లోని పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాలలో నాడు నేడు కింద నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కొత్తగా కట్టిన సిమెంట్ గోడలకు కాంట్రాక్టర్, అధికారులు క్యూరింగ్ చేయించాలి. కానీ మంగళవారం సాయంత్రం ప్రమాదకర స్థితిలో ఒక విద్యార్థిని గోడపైకి ఎక్కించి నీరు పట్టించడం కన్పించింది.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 23: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సింధూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు. భక్తులు తమలపాకుల మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రాజీవ్ నగర్ రోడ్డుకు మరమ్మతులు


శ్రీకాళహస్తి, జనవరి 23: శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్ నగర్ ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె పవిత్రా రెడ్డి మంగళవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు రివార్డు



వరదయ్యపాళెం, జనవరి 23: సత్యవేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నగదు బహుమతి, జ్ఞాపికలు అందజేశారు.ప్రథమ స్థానం పొందిన దివిషకు రూ.10వేలు,ద్వితీయస్థానంసాధించినప్రవీణకు రూ.6వేలు, తృతీయస్థానంలో నిలిచిన దివ్యకు రూ.4వేలు అందజేశారు. మండల విద్యాశాఖ అధికారులు రవి, ఉష, పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు జక్కుల చొక్కలింగం, రమేష్‌రాజు, మన్నెచంద్రయ్య, సుబ్రహ్మణ్యం, దాత రమేష్ రాజు, ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వైవీఎల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్ పంపిణీలో తిరకాసు



శ్రీకాళహస్తి, జనవరి 23: విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసే క్రమంలో కొత్త తిరకాసును అధికారులు తెరమీదకు తెచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే కొత్తగా అంగీకార పత్రం పేరుతో నిబంధన విధించారు. పరికరం విరిగినా, పోగొట్టుకున్నా తల్లిదండ్రులు రూ.32,000 చెల్లించాల్సిందిగా ఒప్పంద పత్రం తప్పనిసరి చేశారు.మార్కెట్లో రూ.5000 నుంచి ట్యాబ్‌లు లభిస్తున్నాయి. అసలే అంతంత మాత్రంగా ప్రభుత్వ ట్యాబులు పనిచేస్తున్నాయని అందరిలో ఆందోళన ఉంది. ఇప్పుడు అంగీకార పత్రం సమర్పిస్తే తర్వాత భారీ మొత్తంలో నగదు చెల్లించేందుకు బాధ్యులుగా నిలవాల్సి వస్తుందని అందరూ సతమతమవుతున్నారు.

సిపాయి భరోసా అందజేత

ఏర్పేడు, జనవరి 23: ఏర్పేడు మండలం ఆమందూరు బీసీ కాలనీలో వల్లెమ్మ అనే మహిళ ఇటీవల మృతి చెందింది. మంగళవారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ఆమె కుటుంబానికి సిపాయి భరోసా కింద 41 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు. మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, డాక్టర్ బాబు, లోకనాథం, రవి, చిన్న, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కుటుంబానికి పరామర్శ

వరదయ్యపాళెం, జనవరి 23: సత్యవేడు మండలం సిరినంబాదురు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శేఖర్ కుమారుడు దివాకర్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి హెలెన్ మంగళవారం దివాకర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.శివకుమార్, పరంధామయ్య, వెంకటేష్ తదితరులు ఆమె వెంట వున్నారు.

అంగన్‌వాడీల విజయోత్సవం



రేణిగుంట, జనవరి 23 : అకుంఠిత పట్టుదలతో ఆరు వారాల పాటు సమష్టిగా పోరాటం చేయడంతో సమస్యలు పరిష్కరించుకున్నామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ధనమ్మ, భాగ్యలక్ష్మి, రాధమ్మలు వెల్లడించారు. స్థానిక పాత ఎంఆర్వో కార్యాలయం ఎదుట మంగళవారం బాణసంచా పేల్చి విజయోత్సవం నిర్వహించారు.తమ సమ్మెకు మద్దతు తెలిపిన రాజకీయ పార్టీల నాయకులకు, కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సీపీఎం, సీపీఐ నాయకులు కె. హరినాథ్, వెంకటరమణ, కరీముల్లా, రంగయ్య, దిలీప్‌భాషా, రామిరెడ్డిలతో పాటు యూనియన్ నాయకులు విజయలక్ష్మి, అంబిక, విజయ, భారతి, కుసుమ, పాండురంగమ్మ, ప్రభావతి, శాంత, గీత, నిర్మల, సుజాతలు పాల్గొన్నారు.

చెరువులకు తెలుగుగంగ మళ్లింపు

తొట్టంబేడు, జనవరి 23: మండలంలోని కంచినపల్లి, బోనుపల్లి పంట పొలాలకు సరిపడా నీరు చెరువుల్లో లేకపోవడంతో మంగళవారం తెలుగుగంగ కాలువ గేట్లను తెరిచారు.ఎమ్మెల్యే కుమార్తె చొరవ తీసుకుని గేట్లు తెరిపించారని రైతులు చెప్పారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, జనవరి 23: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాల సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. శ్రీకాళహస్తి పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వేడుకగా కాలభైరవ స్వామి ప్రాకార ఉత్సవం

శ్రీకాళహస్తి, జనవరి 23: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. కాలభైరవ స్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం మీదుగా విజయ స్థూపం వరకు వెళ్ళి అక్కడి నుంచి ప్రదక్షిణగా తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు.

శాస్త్రోక్తంగా ప్రదోష నంది సేవ



నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరులు

శ్రీకాళహస్తి, జనవరి 23:శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం ప్రదోష నంది సేవ శాస్త్రోక్తంగా జరిగింది. త్రయోదశి తిధిని పురస్కరించుకుని ప్రదోషకాలంలో విశేష పూజలు చేశారు. స్వామివారి ధ్వజస్తంభం వద్ద వెండి నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరులను కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. ప్రత్యేక హారతులు సమర్పించారు. అనంతరం నంది వాహనంపై ఆలయంలో ప్రదక్షిణగా ప్రాకార ఉత్సవం చేశారు.

టీడీపీ నేతలపై అట్రాసిటీ ఫిర్యాదు

శ్రీకాళహస్తి, జనవరి 23: సుమారు 20 మంది టీడీపీ నాయకులపై కులం పేరుతో దూషించారంటూ వైసీపీ కార్యకర్త శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ వద్ద టీడీపీ ప్రచార రథాన్ని వైసీపీ నాయకులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీనిపై మురళి అనే వైసీపీ నాయకుడి ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులపై కిడ్నాప్ కేసు నమోదయింది. అదే రోజు టీడీపీ ప్రచార రథం డ్రైవర్ మోహన్ ఫిర్యాదుతో ముగ్గురు వైసీపీ నాయకులపై అట్రాసిటీ కేసు నమోదయింది. అయితే మళ్లీ వైసీపీ సుమారు 20 మంది కీలక టీడీపీ నేతలపై అట్రాసిటీ కేసు కోసం ఇంచార్జి సీఐ మల్లికార్జునకు ఫిర్యాదు అందజేసినట్లు సమాచారం.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



బోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అజార్

శ్రీకాళహస్తి, జనవరి 23 : నేతాజీ సుభాష్ చంద్రబోస్ కు స్కౌట్స్ బృందం నివాళులర్పించారు. మంగళవారం బాబు అగ్రహారం పురపాలక సంఘం పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.స్కౌట్ మాస్టర్ యోగానంద, సభ్యులు పార్వతి, అజార్ తదితరులు పాల్గొన్నారు.రాధా రంగా మిత్రమండలి నేత సిద్ధులు గారి ప్రసాద్ కార్గిల్ సెంటర్ వద్ద బోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు

కులగణన సర్వేను వేగవంతం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 23: కులగణన సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో సాయి లహరి సూచించారు.మంగళవారం కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలో కులగణన సర్వే నత్తనడకన జరుగుతుందని కార్యదర్శులు పూర్తి బాధ్యత తీసుకుని సర్వే వేగవంతం చేయించాలని తెలిపారు. సర్వే చేసే వలంటీరుతో పాటుగా ఒక సచివాలయ సిబ్బంది ఖచ్చితంగా ఉండి సర్వే చేయించాలన్నారు.ఏవో త్రివిక్రమ్‌రావు, ఈవోపీఆర్డీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెం ఆడుతున్న నలుగురి అరెస్టు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 23: పార్లపల్లి వద్ద కోడిపందెం ఆడుతున్న నలుగురిని మంగళవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు.

గ్రావెల్ టిప్పర్ల అడ్డగింత

వరదయ్యపాళెం, జనవరి 23: సత్యవేడు మండలం వెంకటరాజుకండ్రిగ గ్రామంలోని కన్నవరం రోడ్డుమార్గంలో గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్థులు మంగళవారం అడ్డుకున్నారు. వీరికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి హెలెన్ హేమలత మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రావెల్ అక్రమ రవాణా వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.అధికారులు స్పందించి అడ్డుకోవాలన్నారు.



అక్రమ గ్రావెల్ వాహనాలను అడ్డుకుంటున్న హెలెన్

నేడు తిరుపతికి సీఎం జగన్

తిరుపతి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి జగన్ బుధవారం తిరుపతి రానున్నారు. తిరుచానూరు సమీపంలోని తాజ్ హోటల్‌లో జరుగుతున్న ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు సాయంత్రం 4 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచీ రోడ్డు మార్గాన 4.30 గంటలకు తాజ్ హోటల్ చేరుకుని సమ్మిట్‌కు హాజరవుతారు.

పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టండి

రేణిగుంట, జనవరి 23 :ముఖ్యమంత్రి జగన్ తిరుపతి పర్యటన సందర్భంగా భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి మంగళవారం అధికారులను ఆదేశించారు. విమానాశ్రయం నుంచి తాజ్ హోటల్ వరకు పొరబాట్లు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షిం చాలన్నారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఆర్డీవోలు నిశాంత్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, ఎయిర్ పోర్టు డైరెక్టర్, సీఎస్‌వో బసవరాజు, రాజశేఖరరెడ్డి, ఏఎస్పీ విమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

వరదయ్యపాళెం, జనవరి 23 : మద్యం మత్తులో ఓ లారీ డ్రైవరు ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నట్లు శ్రీసిటీ ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వరదయ్యపాళెం మండల ప్రధాన రహదారిలో జరిగిన ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదన్నారు. లారీ డ్రైవర్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మన ఊరి బ్యాంకును ఆదరిద్దాం

శ్రీకాళహస్తి, జనవరి 23: మన ఊరు... మన బ్యాంకు అన్న భావంతో కోఆపరేటివ్ టౌన్ బ్యాంకును అందరూ ఆదరించాలని కమిటీ సభ్యులు మంగళవారం ప్రకటనలో కోరారు. శ్రీకాళహస్తి టౌన్ బ్యాంక్ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఖాతాదారుల కోసం రుణాలపై వడ్డీలు తగ్గించనున్నట్లు వెల్లడించారు. అలాగే వచ్చే నెల నుంచి ప్రతి శుక్రవారం బ్యాంకు సెలవుగా పాటిస్తూ... ఆదివారం రోజున టౌన్ బ్యాంకు ప్రజలకు యధావిధిగా సేవలందిస్తుందని తెలిపారు. వచ్చే నెల నుంచి ఈ సేవలు అమలు చేస్తామని పేర్కొన్నారు. ఖాతాదారులు ఆదివారం రోజున పని వేళలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ముక్కంటి సేవలో దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి



శ్రీకాళహస్తి, జనవరి 23: సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి మంగళవారం ముక్కంటిని దర్శించుకున్నారు. సహస్ర లింగం వద్ద రాహు కేతు సర్పదోష నివారణ పూజలు జరిపించుకున్నారు.గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీసిటీలో గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య బృందం

శ్రీసిటీ, వరదయ్యపాళెం, జనవరి 23: శ్రీసిటీని మంగళవారం ఏపీ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్యకు చెందిన 35మంది సభ్యుల బృందం సందర్శించింది. సంస్థ ఛైర్మన్ ప్రకాష్‌యాదవ్, మేనేజింగ్ డైరెక్టర్ దామోదర నాయుడు ఆధ్వర్యంలో ఈ పర్యటన సాగింది.

